

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 197 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం, 17, జూన్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# చిన్న కాంట్రాక్టర్లకు.. ప్రభుత్వం భరోసా !





- పెండింగ్ బిల్లులు దశలవారీగా చెల్లిస్తామని భట్టి హామీ
- కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ
- బిల్లుల ఆలస్యంతో ఆర్థిక ఇబ్బందుల్లో చిన్న కాంట్రాక్టర్లు
- చెల్లింపుల ప్రక్రియ వేగవంతం చేయాలని అసోసియేషన్ విజ్ఞప్తి
- 'చలో హైదరాబాద్' కార్యక్రమం తాత్కాలిక వాయిదా







డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, ఛైర్మన్



రాష్ట్రంలోని చిన్న సివిల్ కాంట్రాక్టర్లకు ప్రభుత్వం ఊరటనిచ్చే సంకేతాలు ఇచ్చింది. పెండింగ్ బిల్లుల సమస్యను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఆర్థిక పరిస్థితులను సమీక్షిస్తూ చిన్న కాంట్రాక్టర్ల బిల్లులను ప్రాధాన్య క్రమంలో దశలవారీగా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. బిల్లుల ఆలస్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాంట్రాక్టర్ల సమస్యలను ప్రజాభవన్‌లో జరిగిన సమావేశంలో వినిపించారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రావడంతో కాంట్రాక్టర్లు తమ ఆందోళన కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు.

- హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2

## బిజెపికి లబ్ధి చేకూర్చేలా సర్ ప్రక్రియ

- కేంద్రానికి తొత్తుగా మారిన ఎన్నికల సంఘం
- బెంగాల్లో 92 లక్షల ఓట్ల తొలగింపే నిదర్శనం
- బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో పిసిసి చీఫ్ విమర్శలు

6



## పెంచిన ఆక్వా ఫీడ్ ధరల్ని తగ్గించాలి

- లేదంటే ఆక్వా రైతులకు మద్దతుగా పోరాటం
- ప్రభుత్వాన్ని హెచ్చరించిన వైఎస్ జగన్



5

## పారదర్శకంగా యూరియా పంపిణీ

- ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇంటినుంచే బుకింగ్
- ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులకు లబ్ధి
- క్యూ లైన్లు కట్టాల్సిన దుస్థితి రాకుండా నిర్ణయం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

6

## హైకోర్టు ఆదేశాలతో ఆగిన కొత్త జర్నలిస్టు బస్ పాసులు

- పాత కార్డులకే రెన్యువల్
- అయోమయంలో అక్రెడిటేషన్ల ప్రక్రియ

2






## సన్నరకం వరి విత్తనాలు సిద్ధం చేయండి

- రైతు వేదికల వద్ద అందుబాటులో ఉంచండి
- సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించండి
- వ్యవసాయంలో కూడా ఎఐ, టెక్నాలజీ వినియోగం పెరగాలి
- వ్యవసాయ వర్సిటీ నోడల్ ఏజెన్సీగా సాంకేతిక సహకారం
- వ్యవసాయరంగంపై ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ సూచన

2

# చిన్న కాంట్రాక్టర్లకు ప్రభుత్వం భరోసా

**హైదరాబాద్(జై భీమ్ డెస్క్)**

రాష్ట్రంలోని చిన్న సివిల్ కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంగళవారం ప్రజాభవన్‌లో జరిగిన సమావేశంలో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, వివిధ జిల్లాలకు చెందిన చిన్న సివిల్ కాంట్రాక్టర్లు ఉపముఖ్యమంత్రిని కలిసి పెండింగ్ బిల్లుల విడుదల, ఆర్థిక ఇబ్బందుల నివారణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన భట్టి విక్రమార్క, గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిల కారణంగా చిన్న కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం గుర్తించిందన్నారు. చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసినప్పటికీ బిల్లులు ఆలస్యమవడంతో బ్యాంకు రుణాలు, కార్మికుల వేతనాలు, నిర్మాణ సామగ్రి సరఫరాదారుల చెల్లింపుల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆర్థిక పరిస్థితులను సమీక్షిస్తూ ప్రాధాన్యత క్రమంలో పెండింగ్ బిల్లులను విడుదల చేస్తోందని, ముఖ్యంగా చిన్న కాంట్రాక్టర్లకు సంబంధించిన బిల్లుల చెల్లింపుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పెండింగ్ బకాయిల చెల్లింపులకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించామని, దశలవారీగా అన్ని అర్హత కలిగిన బిల్లులను పూర్తిగా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కాంట్రాక్టర్ల ప్రతినిధులు తమ సమస్యలను వివరించుతూ, నెలల తరబడి బిల్లులు నిలిచిపోవడంతో అనేక మంది ఆర్థికంగా కుదేలయ్యారని తెలిపారు. ప్రభుత్వ పనులను పూర్తి చేసినప్పటికీ చెల్లింపులు అందకపోవడం వల్ల చిన్న కాంట్రాక్టర్లు అప్పుల పాలవుతున్నారని, బిల్లుల విడుదల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. అలాగే భవిష్యత్తులో పనులు పూర్తైన వెంటనే నిర్దిష్ట గడువులో చెల్లింపులు జరిగే విధంగా విధానపరమైన మార్పులు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు కాంట్రాక్టర్ల ప్రతినిధులు కోమటిరెడ్డి వెంకటరెడ్డితో సమావేశమై తమ సమస్యలను వివరించారు. శాఖ వారీగా పెండింగ్‌లో ఉన్న బిల్లుల వివరాలు, కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించారు. అనంతరం జరిగిన చర్చల వివరాలను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు తెలియజేశారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రావడంతో ఈ నెల 18న నిర్వహించాలనుకున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ రవీందర్ రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలును పరిశీలించిన తర్వాత తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. చిన్న కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి సహకరిస్తున్న రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి అసోసియేషన్ తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చితే రాష్ట్రవ్యాప్తంగా వేలాది చిన్న కాంట్రాక్టర్లకు ఉపశమనం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన పలువురు ప్రతినిధులు, వివిధ కాంట్రాక్టర్ల సంఘాల నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. ప్రభుత్వం--కాంట్రాక్టర్ల మధ్య సమన్వయంతో పెండింగ్ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది.




# పవన్ కళ్యాణ్ హనుమకొండ పర్యటన..

**భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సీపీ**



**హన్మకొండ, 16 జూన్ 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

పవన్ కళ్యాణ్ పర్యటన వేళ భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సీపీ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్ కళ్యాణ్ బుధవారం ఉదయం తన అభిమాని కోరిక మేరకు అతడిని పరామర్శించేందుకు హనుమకొండకు రానున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ డీసీపీ కవిత, హనుమకొండ ఏసీపీ నర్సింహారావు, సీఐ మచ్చ శివకుమార్‌తో కలిసి పర్యటన మార్గం, సభా ప్రదేశం పరిసరాలను పరిశీలించారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అమలు చేయాల్సిన భద్రతా చర్యలపై సీపీ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, భద్రతా ప్రమాణాలు కట్టుదిట్టంగా పాటించాలని ఆదేశించారు.

# హైకోర్టు ఆదేశాలతో ఆగిన కొత్త జర్నలిస్టు బస్ పాసులు

**పాత కార్డులకే రెన్యువల్**
**అయోమయంలో అక్రెడిటేషన్ల ప్రక్రియ**

**హైదరాబాద్ జై భీమ్ డెస్క్ :**

రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు 2026-28 సంవత్సరాలకు గానూ జారీ చేసిన కొత్త అక్రెడిటేషన్ కార్డులకు ఇవ్వాల్సిన బస్ పాస్ లకు హైకోర్టు బ్రేక్ వేసింది. అక్రెడిటేషన్ల జీవో ఎంఎస్ 252, జీవో ఆర్టీ నెంబర్ 229 లను సవాల్ చేస్తూ . 1. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, 2. ఏవీఎన్ టీవీ కరస్పాండెంట్ నంబి పర్వతాలు, 3. మరో ఇద్దరు రాష్ట్ర హైకోర్టులో దాఖలు చేసిన పిటీషన్లపై మంగళవారం వాదనలు జరిగాయి. పిటిషనర్ సోమయ్య వేసిన పిటీషన్ లో ఐఅండ్ పీఆర్ స్పెషల్ కమీషనర్ ను, వివిధ జిల్లాల డీపీఆర్వోలను ప్రతివాదులుగా చేర్చారు.అక్రెడిటేషన్ జీవో పై దాఖలైన నాలుగు పిటీషన్ల పై హైకోర్టు సింగిల్ బెంచ్ ఒకేసారి విచారణ జరిపింది.జీవో 252 ప్రకారం రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లోకి నాలుగు జర్నలిస్టు సంఘాలను తీసుకోవాల్సి ఉండగా కేవలం మూడు సంఘాలను మాత్రమే తీసుకొని కమిటీల కూర్పుతో అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ మామిడి సోమయ్య తరపు న్యాయవాది వాదించారు. నాలుగు సంఘాలతో కాకుండా కేవలం మూడు సంఘాలతోనే జీవో ను అమలు చేయడం నేరమని, ఒక ఐఏఎస్ అధికారి ఇంతటి తప్పు చేయడం నేరమని న్యాయమూర్తి పేర్కొన్నారు..

# సీబీఎన్ ఎట్ 361 డిగ్రీస్.. పాలీమ్యాథ్ పుస్తకం

**సింగపూర్‌లో ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు**

**అమరావతి,జూన్16(జై భీమ్ న్యూస్):**

సీబీఎన్ 361 డిగ్రీస్.. పాలీమ్యాథ్ పుస్తకాన్ని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్‌లో ఆవిష్కరించారు. కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పుస్తకం తొలి ప్రతులను సింగపూర్‌లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, మంత్రి పి.నారాయణ, కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులకు అందించారు. ఈ పుస్తకాన్ని 'రేపటి కోసం' దినపత్రిక చీఫ్ ఎడిటర్ శాఖమూరు శ్రీనివాస ప్రసాద్ రచించారు. దీనిని విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ సత్యనారాయణ ఆంగ్లంలో అనువదించారు. దార్శనిక నేతగా ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ సందర్భాల్లో తీసుకున్న నిర్ణయాలను విశ్లేషిస్తూ ఈ పుస్తకాన్ని రచించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ పాలకులుగా గుర్తింపు ఉన్న సింగపూర్, న్యూజిల్యాండ్ మాజీ ప్రధానులు లీ క్వాన్ యూ, జేసిందా ఆర్డాడ్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ నేతల తరహాలోనే సీఎం చంద్రబాబు నిర్ణయాలు తీసుకొంటున్నారని.. ఏపీ అభివృద్ధికి విజన్‌ల రూపకల్పనతో పాటు అమరావతి రాజధాని నిర్మాణంలో తీసుకుంటోన్న శ్రద్ధ దీనికి ప్రత్యక్ష ఉదాహరణ అని రచయిత వివరించారు. ఏపీ రెరా మాజీ చైర్మన్ రామనాథ్ వివిధ సందర్భాల్లో వ్యక్తపరిచిన అభిప్రాయాల్లో బాహ్య ప్రపంచానికి తెలియని అంశాలను సీబీఎన్‌అ361 డిగ్రీస్ పుస్తకంలో ఆవిష్కరించినట్టు తెలిపారు. సింగపూర్ ప్రభుత్వ గుర్తింపు పొందిన కాకతీయ కల్చరల్ అసోసియేషన్.. ముఖ్యమంత్రిని గ్లోబల్ పాలీమ్యాథ్ అవార్డుతో సత్కరించింది. సింగపూర్ రూపకర్త లీ క్వాన్ యూ శతజయంతిని పురస్కరించుకుని విడుదల చేసిన వెండి నాణెళిన్ని సీఎం చంద్రబాబుకు అసోసియేషన్ ప్రతినిధులు బహూకరించారు. త్వరలోనే ఈ పుస్తకం తెలుగు, హిందీ సహా వివిధ భారతీయ భాషల్లో విడుదల చేయనున్నట్టు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెరా మాజీ చైర్మన్ రామనాథ్, కేవీ సత్యనారాయణ, శంకర ప్రసాద్, సింగపూర్‌లోని తెలుగు ప్రముఖులు పాల్గొన్నారు.




# సన్నరకం వరి విత్తనాలు సిద్ధం చేయండి

**రైతు వేదికల వద్ద అందుబాటులో ఉంచండి**
**సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించండి**
**వ్యవసాయంలో కూడా ఎఐ, టెక్నాలజీ వినయోగం పెరగాలి**
**వ్యవసాయ వర్సిటీ నోడల్ ఏజెన్సీగా సాంకేతిక సహకారం**
**వ్యవసాయరంగంపై ఉన్నతస్థాయి సమిక్షలో సిఎం రేవంత్ సూచన**



**హైదరాబాద్,జూన్16(జై భీమ్ న్యూస్):**

ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. నిర్దేశించిన వరిరకాల విత్తనాలను రైతు వేదికలో అందుబాటులో ఉంచాలని మార్గనిర్దేశం చేశారు. సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలని ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమిక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 7 రకాల సన్న వడ్లను సబ్సిడీపైన ఇవ్వాలని మార్గనిర్దేశర చేశారు. భద్రాద్రి కొత్తగూడం దమ్మపేట మండలంలో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్టను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింతగా పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఏఐని మరింతగా వినియోగించాలని నిర్దేశిరచారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని సాంకేతికతను పెంచుకోవాలని సూచించారు. సీడ్స్ నుంచి కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించుకునే ప్రయత్నాలు చేయాలని పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్‌ను బలోపేతం చేసుకోవాలని తెలిపారు. అన్ని వ్యవసాయ మందులకు సంబంధించి ఓ యాప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా బుక్ చేసుకునే యూరియాను రైతు వేదిక ద్వారా పంపిణీ చేయాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు యూరియా పంపిణీ బాధ్యతను అప్పగించాలని ఆదేశించారు. యూరియా, ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడూ కేంద్రప్రభుత్వానికి లేఖలు రాయాలని ఆదేశించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయిన ఎరువులు మొత్తం తెలంగాణకే ఇచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎరువుల పరిస్థితిపైన అన్ని పార్టీల ఎంపీలతో ఓ సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరించాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం

**వరంగల్,జూన్16(జై భీమ్ న్యూస్):**

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బలవన్మరణానికి పాల్పడటం వరంగల్ జిల్లాలో కలకలం సృష్టించింది. ఢిల్లీలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న వరంగల్ కాశీబుగ్గకు చెందిన యువతి మానసిక ఒత్తిడితో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కాశీబుగ్గలో పాత పేపర్లు కొనే వ్యాపారం చేసే గంజి ఉమాశంకర్ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వీరిలో రెండు కుమార్తె గంజి కీర్తన (25) ఢిల్లీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంది. ఇటీవల పనిభారంతో కీర్తన తీవ్ర మానసిక ఒత్తిడికి గురైంది. మానసికంగా డిప్రెషన్‌లోకి వెళ్లిన కూతుర్ని చూసిన తల్లిదండ్రులు మూడు నెలల క్రితం వరంగల్‌కు తీసుకొచ్చారు. హనుమకొండలోని ఓ మానసిక వైద్యుడి వద్ద కొంతకాలంగా చికిత్స కూడా ఇప్పిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి కీర్తన ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఈ ఘటన స్థానికంగా విషాదం నింపింది.

# మానవత్వం చాటుకున్న మట్టేవాడ పోలీసులు



**వరంగల్ : (జై భీమ్ న్యూస్)**

పెద్దనాన్న ఆటో వెనకాల వెళ్తూ తప్పిపోయిన బాలికను పోలీసులు గుర్తించి, ఆమెను మట్టేవాడ పోలీస్ స్టేషన్ వద్దకు చేర్చి మానవత్వాన్ని చాటుకున్నారు. వరంగల్ చౌరస్తాలోని సత్యం హాస్పిటల్ సమీపంలో గల షబీనా (6) అనే బాలిక మంగళవారం ఆటో డ్రైవర్ అయినా తన పెద్దనానతో ఆటోలో వస్తానని మారం చేయగా ఆయన వద్దంటూ ఆటోలో బయటికి వెళ్లాడు. దీంతో షబీనా తన పెద్దనాన్న ను వెతుక్కుంటూ పోచమ్మ మైదాన్, ఎంజీఎం మీదిగా ములుగు రోడ్డుకు వెళ్ళసాగింది. అక్కడ విధులు నిర్వహిస్తున్న మట్టేవాడ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ నరేష్ కుమార్ తోపాటు ట్రాఫిక్ కానిస్టేబుళ్లు కుమారస్వామి, బాలరాజు బాలికతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సదరు బాలికను మట్టేవాడ పోలీస్ స్టేషన్ ఎస్సై రాజేందర్ కు అప్పగించారు.

# కమలాపురం గురుకుంట చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు భగ్నం

**6 ట్రాక్టర్లు, 1 జేసీబీ సీజ్ - ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జ్యోతి**

**మంగపేట జూన్ 16: జై భీమ్ న్యూస్**





ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గురుకుంట చెరువులో అనుమతులు లేకుండా జేసీబీతో మట్టి తవ్వకాలు జరుపుతున్న వారిపై ఫారెస్ట్ శాఖ కొరడా ఝుళిపించింది. మంగళవారం గురుకుంట చెరువులో జేసీబీతో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయన్న సమాచారంతో కమలాపురం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జ్యోతి సిబ్బందితో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. తనిఖీల్లో ఫారెస్ట్ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా జేసీబీతో మట్టి తవ్వుతున్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడ పని చేస్తున్న 6 ట్రాక్టర్లు, 1 జేసీబీని సీజ్ చేసి మంగపేట ఫారెస్ట్ కార్యాలయానికి తరలించారు. బీట్ ఆఫీసర్ జ్యోతి మాట్లాడుతూ సర్వే నం. 107/లోని గురుకుంట చెరువు రిజర్వ్ ఫారెస్ట్ కంపార్ట్‌మెంట్ పరిధిలోకి వస్తుంది ఫారెస్ట్ కన్సర్వేషన్ యాక్ట్ 1980 ప్రకారం డిఎఫ్ఓ అనుమతి లేకుండా ఫారెస్ట్ భూమిలో మట్టి తీయడం, జేసీబీ వాడడం నేరం. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. సీజ్ చేసిన వాహనాలను ఫారెస్ట్ కస్టడీలో ఉంచారు. వాహన యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఫైన్ చెల్లించిన తర్వాత డిఎఫ్ఓ ములుగు ఉత్తర్వుల మేరకే వాహనాలు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. గురుకుంట చెరువు అమృత్ సరోవర్ పథకం కింద పూడిక తీతకు ఎంపికైంది. అయితే సర్వే నం. 107/ ఫారెస్ట్-రెవెన్యూ వివాద భూమి కావడంతో ఈ చర్యలు చోటుచేసుకున్నాయి.

# రెండో జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**రాజీతో సమస్యలను పరిష్కరించుకోండి: సీపీ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్, 16 జూన్ 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

ఈ నెల 20న నిర్వహించనున్న రెండో జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుని రాజీ ద్వారా తమ వివాదాలను పరిష్కరించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌కు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనరేట్ రూపొందించిన వాల్ పోస్టర్లను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబ, వైవాహిక జీవితానికి సంబంధించిన వివాదాలు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ తదితర కేసుల్లో ఇరుపక్షాల మధ్య రాజీకి అవకాశం ఉంటుందని తెలిపారు. రాజీయే రాజమార్గమని పేర్కొన్న ఆయన, చిన్నచిన్న వివాదాలను పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకోవద్దని సూచించారు. న్యాయశాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరిన ఆయన, రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించి అవగాహన కల్పించేలా పోలీసు అధికారులు చర్యలు చేపడతారని తెలిపారు. తమ కేసుల్లో రాజీ కావాలనుకునే వారు సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందే అవకాశం ఉందని సీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీ సత్యనారాయణ, పరకాల ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్, ఎస్ఐ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# 79 మంది ఐపీఎస్ ప్రొబేషనరీ అధికారులకు గ్రేహౌండ్స్ ప్రత్యేక శిక్షణ

**హైద్రాబాద్, 16 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**




దేశ భద్రతా సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు యువ ఐపీఎస్ అధికారులకు క్షేత్రస్థాయి ఆపరేషనల్ అనుభవం కల్పించే లక్ష్యంతో రెగ్యులర్ రిక్రూట్మెంట్ (ఆర్ఆర్-79) బ్యాచ్‌కు చెందిన 79 మంది ఐపీఎస్ ప్రొబేషనరీ అధికారులకు హైదరాబాద్‌లోని ప్రేమవతీపేట్ గ్రేహౌండ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో వారం రోజుల ప్రత్యేక అనుబంధ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణలో జంగిల్ ఆపరేషన్లు, కౌంటర్ ఇన్సర్జెన్సీ వ్యూహాలు, ఉగ్రవాద వ్యతిరేక చర్యలు, అడవి ప్రాంతాల్లో కార్యాచరణ నైపుణ్యాలు, ఫీల్డ్ క్రాఫ్ట్, నైట్ ఆపరేషన్లు, ఇంటెలిజెన్స్ ఆధారిత ఆపరేషన్లు, ప్రత్యేక దాడుల విధానాలు వంటి కీలక అంశాలపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నారు. దేశంలో అత్యంత సమర్థవంతమైన ప్రత్యేక దళాలలో ఒకటైన తెలంగాణ గ్రేహౌండ్స్ అనుసరిస్తున్న కార్యాచరణ విధానాలను ప్రత్యక్షంగా అధ్యయనం చేసే అవకాశాన్ని యువ అధికారులకు కల్పిస్తున్నారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా గ్రేహౌండ్స్, ఆక్టోపస్ డీజీ డాక్టర్ అనిల్ కుమార్ ప్రొబేషనరీ అధికారులతో సమావేశమై వారికి మార్గనిర్దేశం చేశారు. భారతదేశం వంటి విభిన్న పరిస్థితులు కలిగిన దేశంలో పోలీసు అధికారుల బాధ్యతలు రోజురోజుకు మరింత సవాళ్లతో కూడుకున్నవిగా మారుతున్నాయని ఆయన అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు అంతర్గత భద్రత, ఉగ్రవాదం, తీవ్రవాదం, తిరుగుబాటు ధోరణులను ఎదుర్కొనేందుకు అధికారులు అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని సూచించారు. గ్రేహౌండ్స్ విజయాలకు క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ, బృంద సమన్వయం, వేగవంతమైన స్పందన ప్రధాన కారణాలని పేర్కొన్న ఆయన, ఒక పోలీసు అధికారి విజయవంతమైన నాయకుడిగా ఎదగాలంటే వృత్తి నైపుణ్యంతో పాటు మానసిక దృఢత్వం, నిర్ణయాత్మకత, ప్రజల పట్ల నిబద్ధత, నైతిక విలువలు కూడా అవసరమని తెలిపారు. అడవి ప్రాంతాల్లో నిర్వహించే ఆపరేషన్లు అత్యంత క్లిష్టమైనవని, అలాంటి పరిస్థితుల్లో పరిస్థితులను వేగంగా అంచనా వేసి సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని అధికారులు పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో వివిధ రాష్ట్రాల్లో కీలక బాధ్యతలు నిర్వహించే సమయంలో ఈ శిక్షణ ద్వారా పొందిన అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ రామ్ నివాస్, గ్రేహౌండ్స్ కన్సల్టెంట్ సోమేశ్వర్ సింగ్ సిన్సిన్వార్, గ్రూప్ కమాండర్ ఎన్.వి. సత్య శ్రీనివాస్ రావు, స్క్వాడ్రన్ కమాండర్ ఎస్. ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

## మెడకు ఇనుప గొలుసుతోనే 6 కిలోమీటర్లు నడిచి పోలీస్ స్టేషన్‌కు చేరిన మహిళ

**రాజ్‌గఢ్, 16 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**



మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లాలో ఓ మహిళపై భర్త అమానుషంగా ప్రవర్తించిన ఘటన కలకలం రేపింది. మెడకు ఇనుప గొలుసు బిగించి ఇంట్లో బంధించిన భర్త చెర నుంచి తప్పించుకున్న మహిళ, అదే గొలుసుతో సుమారు ఆరు కిలోమీటర్లు నడిచి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది. ఖిల్చీపూర్ ప్రాంతానికి చెందిన మంగీబాయి తన్వర్ అనే మహిళపై ఆమె భర్త సర్దార్ సింగ్ తన్వర్ దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. జూన్ 10న మద్యం సేవించి ఇంటికి వచ్చిన సర్దార్ సింగ్, భోజనం సిద్ధంగా లేదన్న కారణంతో భార్యతో గొడవపడి తీవ్రంగా కొట్టినట్లు సమాచారం. అనంతరం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా అడ్డుకుని తిరిగి ఇంటికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇంటికి తీసుకెళ్లిన తర్వాత మంగీబాయి మెడకు ఇనుప గొలుసు వేసి స్తంభానికి బంధించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా వేడి చేసిన ఇనుప రాడ్‌తో శరీరంలోని పలు భాగాలపై వాతలు పెట్టినట్లు బాధితురాలు పోలీసులకు తెలిపింది. దాదాపు ఒక రోజు పాటు బంధించబడిన ఆమె, భర్త బయటకు వెళ్లిన సమయంలో రాయితో తాళం పగులగొట్టి తప్పించుకుంది. మెడలో గొలుసుతోనే సుమారు ఆరు కిలోమీటర్లు నడిచి ఖిల్చీపూర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న బాధితురాలిని చూసి పోలీసులు దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడు సర్దార్ సింగ్ తన్వర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. మహిళపై జరిగిన అమానుష ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## సోదరి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన గద్వాల విజయలక్ష్మి

**హైద్రాబాద్, 16 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

తన సోదరి కనిపించడంలేదంటూ మాజీ మేయర్, తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులకు అందించిన ఫిర్యాదు మేరకు, బంజారాహిల్స్ రోడ్ నంబర్-12లో నివసిస్తున్న ఆమె సోదరి కె. నమ్రత (57) ఈ నెల 4వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల వద్ద ఆరా తీసినా ఆమె ఆచూకీ లభించలేదని ఫిర్యాదులో తెలిపారు. నమ్రత అదృశ్యానికి సంబంధించి సతీష్ (35), సత్యనారాయణ (45), కుమారి (45) అనే ముగ్గురు వ్యక్తులపై అనుమానం ఉన్నట్లు గద్వాల విజయలక్ష్మి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అదృశ్యమైన నమ్రత ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కేసుకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.



# హనుమకొండ జిల్లాలో 70 గ్రామాల్లో భూ రీసర్వే

**పారదర్శకంగా, ఖచ్చితత్వంతో పనులు చేపట్టాలి: అదనపు కలెక్టర్ ఎన్. రవి**




**హన్మకొండ, 16 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలో చేపట్టనున్న భూముల రీసర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో సర్వే అధికారులు, లైసెన్స్ సర్వేయర్లతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 14 మండలాల పరిధిలో 70 గ్రామాల్లో భూముల రీసర్వే చేపట్టేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఆయన తెలిపారు. రీసర్వే పనులను సమర్థవంతంగా నిర్వహించేందుకు మండల సర్వేయర్లతో పాటు లైసెన్స్ సర్వేయర్లను కలుపుకుని ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని భూమి కొలతల శాఖ సహాయ సంచాలకుడు నూర్ సింగ్ ను ఆదేశించారు. ఆధునిక రోవర్ పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా భూ సర్వేను అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహించాలని సూచించారు. రీసర్వే ప్రక్రియపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, భూ యజమానుల సహకారంతో పనులను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. రీసర్వే చేపట్టనున్న గ్రామాల్లో జూలై 2న గ్రామసభలు నిర్వహించి ప్రజలకు పూర్తి వివరాలు తెలియజేసిన అనంతరం సర్వే పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి మండలంలో ఒక మండల సర్వేయర్‌తో పాటు ఇద్దరు లైసెన్స్ సర్వేయర్లను నియమించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. భూ రికార్డుల ఖచ్చితత్వం, పారదర్శకత, భూ వివాదాల నివారణ లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఈ రీసర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో సర్వే అధికారులు సారంగపాణి, రాజనర్సయ్య, భూమి కొలతల శాఖ అధికారులు, లైసెన్స్ సర్వేయర్లు పాల్గొన్నారు.

# ఉద్యోగ ఒత్తిడితో యువతి ఆత్మహత్య

**వరంగల్, 16 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**



వరంగల్ నగరంలోని కాశీబుగ్గ ప్రాంతంలో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన విషాదాన్ని నింపింది. కాశీబుగ్గ తిలక్ రోడ్డుకు చెందిన గంజి కీర్తన (25) తన నివాసంలో ఉరివేసుకుని మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం, కీర్తన బెంగళూరులోని ఓ విదేశీ సంస్థలో ఉద్యోగం చేస్తోంది. గత కొంతకాలంగా ఉద్యోగ ఒత్తిడితో మానసిక ఆందోళనకు గురై చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం ఆమె తండ్రి గంజి ఉమాశంకర్ వ్యాపార పనుల నిమిత్తం బయటకు వెళ్లగా, తల్లి కృష్ణవేణి గ్రీవెన్స్ సెల్‌కు వెళ్లారు. ఈ సమయంలో కీర్తన ఇంట్లో ఒంటరిగా ఉన్నట్లు తెలిసింది. కొంతసేపటి తర్వాత ఇంటికి వచ్చిన తల్లి కిటికీ ద్వారా చూడగా, బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని కీర్తన వేలాడుతూ కనిపించింది. వెంటనే బంధువుల సహాయంతో తలుపులు బలవంతంగా తెరిచి లోపలికి వెళ్లి ఆమెను కిందకు దించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న ఇంతేజార్‌గంజ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కీర్తన మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపినట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# వృద్ధులు, క్లిష్టమైన క్యాన్సర్ రోగులకు అత్యాధునిక చికిత్స

**అడ్వాన్స్‌డ్ స్టేజ్ క్యాన్సర్‌కు కూడా సమర్థవంతమైన వైద్యం అందిస్తున్నాం: డాక్టర్ ప్రదీప్ కుమార్**

**హన్మకొండ, 16 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

వృద్ధులు, ఇతర తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న క్లిష్టమైన క్యాన్సర్ రోగులకు అత్యాధునిక సాంకేతికతతో సమర్థవంతమైన చికిత్స అందిస్తున్నామని సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. మంగళవారం హనుమకొండ నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వయస్సు పైబడిన వారు లేదా సంక్లిష్ట వైద్య చరిత్ర కలిగిన రోగులకు క్యాన్సర్ చికిత్స అందించడం గతంలో వైద్యులకు పెద్ద సవాలుగా ఉండేదన్నారు. అయితే ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక సాంకేతికతతో అలాంటి రోగులకు కూడా సమర్థవంతంగా చికిత్స అందించగలుగుతున్నామని పేర్కొన్నారు. భారతదేశంలోనే తొలిసారిగా ఈ సాంకేతికతను యశోద ఆస్పత్రిలో ప్రవేశపెట్టినట్లు తెలిపారు. గతంలో సాధారణ చికిత్సలను తట్టుకోలేరని భావించిన వృద్ధులు, ఇతర తీవ్రమైన అనారోగ్యాలతో బాధపడుతున్న అడ్వాన్స్‌డ్ స్టేజ్ క్యాన్సర్ రోగులకు కూడా విజయవంతంగా చికిత్స అందిస్తూ కొత్త ఆశలు కల్పిస్తున్నామని చెప్పారు. వైద్య రంగంలో వస్తున్న సాంకేతిక పురోగతితో క్యాన్సర్ చికిత్స మరింత సులభతరం, ఫలితాల పరంగా మెరుగ్గా మారిందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ మేనేజర్ రామారపు రమేష్, ఎగ్జిక్యూటివ్ పవన్ తదితరులు పాల్గొన్నారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem సామాన్యుడి ఆయుధంగా

# ఖిలా వరంగల్, ఉర్సు రంగలీల మైదానం అభివృద్ధి పనుల పరిశీలన

**నాణ్యత ప్రమాణాలతో గడువులోగా పూర్తి చేయాలి: కలెక్టర్ సత్య శారద**

**వరంగల్, 16 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ నగర అభివృద్ధిలో భాగంగా ఖిలా వరంగల్ మోటు, కరీమాబాద్‌లోని ఉర్సు రంగలీల మైదానంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం పరిశీలించారు. జీడబ్ల్యూఎంసీ చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, సంబంధిత శాఖల అధికారులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అభివృద్ధి పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని, ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి



సారించాలని అధికారులకు సూచించారు. నగర అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులను మోసం చేసిన సీఎం రేవంత్ రెడ్డి: ఏబీఎస్ఎఫ్



**హన్మకొండ, 16 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హనుమకొండ అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందన్నారు. ఆ హామీలను నమ్మి నిరుద్యోగులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చారని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగ నోటిఫికేషన్ల విడుదల విషయంలో నిరుద్యోగులను నిరాశపరిచారని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగ యువతను మోసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్న ఆయన, వెంటనే ఖాళీ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే నిరుద్యోగులతో కలిసి జిల్లాలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు బండారి శ్రీను, వేణు, కార్తీక్, రవి, సాయి కిరణ్, నవ్య, ప్రసన్న, భాగ్య, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలను సీజ్ చేయాలి

**డీఈఓకు విద్యార్థి సంఘాల వినతిపత్రం**



**హన్మకొండ, 16 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ, డీఎస్‌పి విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజు కు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు దుర్గం సారయ్య, కామగోని శ్రావణ్ మాట్లాడుతూ, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యను సేవారంగం నుంచి వ్యాపార రంగంగా మార్చేశాయని ఆరోపించారు. లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. పాఠశాలల నోటీసు బోర్డులపై ఫీజుల వివరాలు ప్రదర్శించకుండా తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల విక్రయాలు కూడా కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవడంతో పాటు అధిక ఫీజుల వసూళ్లను అరికట్టాలని వారు డీఈఓను కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌పి నాయకులు శివ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## మహదేవ్‌పూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్

**హన్మకొండ, 16 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, రాజనీతి శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎఫ్.సి. జన్ను విజయకుమార్ కు కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. రాజనీతి శాస్త్ర విభాగంలో "ట్రైబల్ డెవలప్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ తెలంగాణ -- ఎ స్టడీ ఆఫ్ కరీంనగర్ డిస్ట్రిక్ట్" అనే అంశంపై సమర్పించిన పరిశోధనా సిద్ధాంత వ్యాసానికి గాను ఈ డాక్టరేట్ లభించింది. రిటైర్డ్ ప్రొఫెసర్ జి. వీరన్న పర్యవేక్షణలో ఆయన తన పరిశోధనను పూర్తి చేశారు. గిరిజన అభివృద్ధి పాలన, సంక్షేమ కార్యక్రమాల అమలు, కరీంనగర్ జిల్లాలో గిరిజనుల సామాజిక-ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన అంశాలపై విజయకుమార్ చేసిన అధ్యయనానికి విశ్వవిద్యాలయం గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ తాళ్లపల్లి మనోహర్, రిజిస్ట్రార్ వి. రామచంద్రం, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ జి. కృష్ణయ్య, అధ్యాపకులు, పరిశోధకులు, స్నేహితులు, బంధువులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## సాహిత్యం--భాష--సాంకేతికతల సమన్వయం నేటి ఉన్నత విద్యకు కీలకం: వీసీ ప్రతాప్ రెడ్డి





**హన్మకొండ, 16 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

సాహిత్యం, భాష, సాంకేతికతల సమన్వయం నేటి ఉన్నత విద్యలో అత్యంత కీలకమైన అంశమని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో, రుసా 2.0 సహకారంతో "న్యూ లిటరరీ అండ్ లాంగ్వేజ్ హోరిజన్స్: వాయిసెస్, జానర్స్ అండ్ టెక్నాలజీస్" అంశంపై నిర్వహిస్తున్న ద్విదిన జాతీయ సదస్సు మంగళవారం విశ్వవిద్యాలయ సెనేట్ హాల్‌లో ప్రారంభమైంది. ఇంగ్లీష్ విభాగాధిపతి డాక్టర్ ఆర్. మేఘనా రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంగ్ల అధ్యయనం సంప్రదాయ సాహిత్యానికి మాత్రమే పరిమితం కాకుండా దళిత, గిరిజన, మహిళా, ప్రవాస భారతీయ, డిజిటల్ సాహిత్య రంగాలకు విస్తరించిందన్నారు. సాంకేతికత బోధన, పరిశోధన, ప్రచురణ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నప్పటికీ మానవీయ విలువలు, సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనలకు ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఆచార్య వై.ఎల్. శ్రీనివాస్ మాట్లాడుతూ, సాంకేతికత మానవ సృజనాత్మకతకు సహాయకారిగా ఉండాలే గానీ దానిని నిస్తేజం చేయకూడదన్నారు. సామాజిక మాధ్యమాల విస్తరణతో ప్రతి పోస్టు ఒక పాఠ్యంగా మారుతోందని, ఇంతవరకు వెలుగులోకి రాని అనేక అనుభవాలు, అంశాలు ప్రపంచ దృష్టికి వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధాన వక్త ఆచార్య సి.ఆర్. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, సాహిత్యం--సాంకేతికతల కలయికతో రచయితత్వం, పాఠకత్వం స్వరూపంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. డిజిటల్ యుగంలో పరిశోధన స్వరూపం పూర్తిగా మారిపోయిందని, హైపర్‌టెక్స్ట్ ఫిక్షన్ వంటి కొత్త కథన రూపాలు సాహిత్యానికి కొత్త దిశలను చూపుతున్నాయని వివరించారు. గౌరవ అతిథి ఆచార్య పి. నిర్మల మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు కారణంగా విద్యా రంగంలో విస్తృత మార్పులు చోటుచేసుకున్నాయని, ఏఐ ఆధారిత రచనలు మానవీయ విలువలను దృష్టిలో ఉంచుకుని సాగాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 90కు పైగా పరిశోధనా పత్రాలు అందినట్లు సదస్సు సంచాలకురాలు డాక్టర్ మేఘనా రావు తెలిపారు. ఈ సందర్భంగా సదస్సు అబ్‌స్ట్రాక్ట్ సంకలనాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ఓఎస్‌డీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, పాలక మండలి సభ్యుడు ఆచార్య ఎం. నవీన్తో పాటు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్‌పై ముమ్మర దర్యాప్తు

కాకినాడ,జూన్16(జై భీమ్ న్యూస్): కాకినాడ జిల్లా తుని చిన్నారి జ్ఞానేశ్వరి కేసుపై పెద్దాపురం డీఎస్పీ తిలక్ కీలక విషయాలు వెల్లడించారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు. మంగళవారం డీఎస్పీ తిలక్ మీడియాతో మాట్లాడారు. 35 నిమిషాల వ్యవధిలో బాలిక మిస్సయిందని చెప్పుకొచ్చారు. చిన్నారి జ్ఞానేశ్వరి సమాచారం తెలిసిన వెంటనే గాలింపు చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. జీడీ పిక్కలు ఏరుకునే వారిని కూడా పిలిచి చిన్నారి గురించి విచారించామని తెలిపారు. పాప మిస్సయిన చోట బొమ్మలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. చిన్నారికి సంబంధించి తప్పుడు వార్తలను ప్రచురించే వారిపై లీగల్‌గా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తిలక్ హెచ్చరించారు.

## 12 ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూపులు

**2014 అధ్యాపకులకు వెంటనే ప్రమోషన్లు కల్పించాలి: టౌటా**



**నిజామాబాద్, 16 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**


తెలంగాణ యూనివర్సిటీలో 2014లో నియమితులైన అధ్యాపకులకు రాష్ట్ర హైకోర్టు డివిజన్ బెంచ్ తుది తీర్పులకు లోబడి షరతులతో కూడిన పదోన్నతులు వెంటనే కల్పించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ (టౌటా) రాష్ట్ర నాయకత్వం డిమాండ్ చేసింది. ఈ మేరకు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ టి. యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఎం. యాదగిరిలకు టౌటా ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టౌటా రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం మల్లేశం మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పదోన్నతుల విషయంలో సానుకూలంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయ అధ్యాపకుల పదోన్నతుల ప్రక్రియను కూడా ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని కోరారు. 2014లో నియామకం పొందిన అధ్యాపకులు గత 12 సంవత్సరాలుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారని, ఈ జాప్యం కారణంగా వారు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పులు, సహజ న్యాయ సూత్రాలను పరిగణనలోకి తీసుకుని సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టి పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యా ప్రమాణాల పెంపు, అధ్యాపకుల సేవా భద్రత, ఉన్నత విద్యాభివృద్ధి దృష్ట్యా పదోన్నతులు అత్యంత కీలకమని పేర్కొన్నారు. అర్హతలు, అనుభవం కలిగిన అధ్యాపకులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరిన టౌటా నాయకులు, పదోన్నతుల ప్రక్రియలో మరింత జాప్యం జరిగితే ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌటా ప్రధాన కార్యదర్శి సి.హెచ్. శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు చలమల వెంకటేశ్వర్లు, సలహాదారులు సి. కాసిం, అక్తర్ అలీ, మద్దిలేటితో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

## కేయూలో రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

**పనులు వేగవంతంగా పూర్తి చేయాలి: వీసీ ప్రతాప్ రెడ్డి**

**హన్మకొండ, 16 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం సమీపం నుంచి ఇంజనీరింగ్ కళాశాల వరకు సుమారు ఒక కిలోమీటరు మేర చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను కాకతీయ విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి మంగళవారం ఉదయం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించిన వీసీ, పనులను వేగవంతంగా పూర్తి చేసి విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డును త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను పాటించడంతో పాటు నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అభివృద్ధి అధికారి ఆచార్య ఎన్. వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు.



# పెంచిన ఆక్వా ఫీడ్ ధరల్ని తగ్గించాలి

**లేదంటే ఆక్వా రైతులకు మద్దతుగా పోరాటం**
**ప్రభుత్వాన్ని హెచ్చరించిన వైఎస్ జగన్**

**అమరావతి,జూన్16(జై భీమ్ న్యూస్):**

పెంచిన ఆక్వా ఫీడ్ ధరల్ని ఈ నెలాఖరులోగా తగ్గించాలని.. లేకుంటే జులై 1, లేదా 2న ఆక్వా రైతుల తరుపున పోరాటం చేస్తామని వైసిపి అధినేత జగన్ హెచ్చరించారు. తాను కూడా ఆక్వా రైతులకు మద్దతుగా వెళ్తానని హెచ్చరించారు. ఈ మేరకు చంద్రబాబు సర్కార్‌కు జగన్‌మోహన్‌రెడ్డి అల్టిమేటం జారీ చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం వైఎస్ జగన్‌తో ఆక్వా రైతులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కూటమి సర్కార్ పాలనతో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని వైఎస్ జగన్‌కు వివరించారు. అనంతరం వైఎస్ జగన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులు, ఆక్వా రైతులు దారుణమైన స్థితిలో ఉన్నారని.. రైతులు, ఆక్వా రైతులు సంతోషంగా ఉండాలనే ఉద్దేశ్యంతో తమ హయాంలో మంచి ఆలోచనలు చేశామన్నారు. 'రైతులు చేయిపట్టుకుని నడిపించే వ్యవస్థలో భాగంగా ఆర్బీకేలను అందుబాటులోకి తీసుకొని వచ్చాం. రాష్ట్ర వ్యాప్తంగా రూ.10వేలకుపైగా ఆర్బీకేలను తీసుకొచ్చాం. రాష్ట్రంలో వ్యాప్తంగా 10వేలకుపైగా ఆర్బీకేలు తీసుకు వచ్చాం. ఆక్వా రైతులకు తోడుగా 35 ఆక్వా ఇంటిగ్రేటెడ్ ల్యాబులు, 782 ఆర్బీకేల్లో ఫిషరీస్ అసిస్టెంట్లను పెట్టామన్నారు. అప్పడా చట్టాన్ని సైతం తెచ్చాం. ముఖ్యమంత్రినే అప్పడా ఛైర్మన్‌గా చేశాం. రైతులకు నష్టం రాకుండా సిండికేట్‌కు స్థానం లేకుండా చేశాం. రూపాయిన్నరకే యూనిట్ కరెంటును సబ్సిడీపై ఇచ్చాం. మన ప్రభుత్వమే ఇవ్వగలిగిందని గర్వంగా చెప్తున్నా. మేనిఫెస్టోలో చెప్పినట్టుగా ఆక్వా రైతులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ సరఫరా చేశాం. అలా 57 నెలల్లో రూ.3,306 కోట్లు విద్యుత్ సబ్సిడీ కింద చెల్లించాం. 2014-19 మధ్య చంద్రబాబు యూనిట్‌కు రూ.3.82లు వసూలు చేసేవాడు. మనం పాదయాత్రలో ఉనప్పుడు చివరి ఆరునెలల్లో యూనిట్‌కు రూ.2లకు ఇస్తానని ఒక జీవో విడుదల చేశాడు. కాని అక్కడ కూడా చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదు. చివరకు చంద్రబాబు కట్టాల్సిన బకాయిలు రూ.340 కోట్లు కూడా మనమే కట్టాం. చిత్తశుద్ధితో మనం చేసిన కార్యక్రమాల వల్ల ఆక్వా రంగం నిలదొక్కుతుంది. చంద్రబాబు హయాంలో 2018-19లో 38 లక్షల టన్నులు ఉన్న రొయ్య, మత్స్య ఉత్పత్తులు 2022-23 నాటికి ఏకంగా 51 లక్షల టన్నులకు పెరిగింది. 2021-22,2022-23లో రెండుసార్లు బెస్ట్ మెరైన్ అవార్డులు వచ్చాయి. ఫీడ్ కంపెనీలు రేట్లు పెంచితే, మూడు సార్లు ఉప సంహరించుకునేలా చేశాం. ఫిషరీస్ యూనివర్శిటీ ద్వారా ఆక్వాసాగుకు నిపుణులను తయారుచేసేలా ఏర్పాటు చేశాం. క్లాసులు కూడా మొదలు పెట్టించాం. చంద్రబాబు మిగిలిన పనులు చేయకుండా విడిచిపెట్టారు. ఆక్వా ఫీడ్, సీడ్, ప్రాసెసింగ్ యూనిట్లు అన్నీ చంద్రబాబు సానుభూతిపరులవే. సిండికేటై పంట చేతికి అందేనాటికి రేట్లు తగ్గించేస్తున్నారు. ఫిబ్రవరిలో ఫీడ్ రేట్లు కిలో రూ.4 పెంచారు. జూన్‌లో మరో రూ.10, రూ.12 పెంచారు. ఈ ప్రభుత్వానికి కచ్చితంగా బుద్ధిచెప్పాల్సిందేననని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.



# భద్రకాళి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠకు ముందు వైభవంగా ధాన్యాదివాసం



**వరంగల్, 16 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ మహానగరంలోని శ్రీ భద్రకాళి దేవస్థానంలో బుధవారం జరగనున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవానికి ముందుగా మంగళవారం ధాన్యాదివాసం, ఫలాదివాసం, పుష్పాదివాసం, శయ్యాదివాస కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో, ఆగమశాస్త్ర పండితుడు గణేశ ఆత్రేయ శర్మ నేతృత్వంలో వేదపండితులు, ఋత్విక్కులు ప్రత్యేక క్రతువులు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన హోమాలు, అభిషేకాలు భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తాయి. తీవ్రమైన ఎండను సైతం లెక్కచేయకుండా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రతువులను తిలకించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన కార్యక్రమాలు మధ్యాహ్నం వరకు కొనసాగగా, అనంతరం భక్తులకు మహాప్రసాదాన్ని పంపిణీ చేశారు. సాయంత్రం మళ్లీ భక్తులు పెద్ద సంఖ్యలో దేవస్థానానికి చేరుకోగా, ధాన్యాదివాసం, ఫల, పుష్ప, శయ్యాదివాస కార్యక్రమాలు నిర్వహించి నీరాజనం, మంత్రపుష్పం, మహాప్రసాద వితరణతో ఆ రోజు కార్యక్రమాలను ముగించారు. బుధవారం ఉదయం 8.36 గంటలకు పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామి చేతుల మీదుగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరగనుంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరుకానున్నారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠను దర్శించడం ద్వారా భక్తులు మహా పుణ్యాన్ని పొందుతారని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ డా. బి. శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు, దాతలు, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గడ్డి కుప్పలకు నిప్పు.. రైతులకు వేల రూపాయల నష్టం

**హసన్‌పర్తిలో కేసు నమోదు**



**హసన్‌పర్తి, 16 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

గోధుమ గడ్డి కుప్పలకు పెట్టిన మంటలు అదుపుతప్పి పక్కనే ఉన్న వ్యవసాయ భూములకు వ్యాపించడంతో పలువురు రైతులకు వేల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిన ఘటన హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం, జయగిరి గ్రామానికి చెందిన అలేటి రాజయ్య ఫిర్యాదు మేరకు ఈ నెల 10న మధ్యాహ్నం గ్రామానికి చెందిన కొంగంటి మొగిలి తన భూమిలోని గోధుమ గడ్డి కుప్పలకు నిప్పు పెట్టాడు. అయితే మంటలు ఒక్కసారిగా వ్యాపించి సమీపంలోని వ్యవసాయ భూములను చుట్టుముట్టాయి. ఈ ప్రమాదంలో అలేటి రాజయ్యకు చెందిన గడ్డి కుప్పలు, విద్యుత్ మోటార్ వైర్లు, పైపులు దగ్ధమయ్యాయి. అలాగే రేనికుంట సుధాకర్, రేనికుంట మోహన్, రేనికుంట ప్రభాకర్, గాదె సారయ్య, శనిగరం సంజీవ్‌లకు చెందిన మోటార్లు, పైపులు, వైర్లు, గడ్డి కుప్పలు, మామిడి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. మొత్తం వేలాది రూపాయల నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన హసన్‌పర్తి పోలీసులు ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# అప్పుల బాధతో రైతు బలవన్మరణం



**హసన్ పర్తి, 16 జూన్ 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురైన ఓ రైతు పురుగుమందు సేవించి ఆత్మహత్య చేసుకున్న ఘటన హసన్‌పర్తి మండలంలో విషాదాన్ని నింపింది. హసన్‌పర్తి పోలీసుల కథనం ప్రకారం, నగరం గ్రామానికి చెందిన రవుల బిక్షపతి (59) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. 2023లో కుమార్తె వివాహం సందర్భంగా కుటుంబ అవసరాల కోసం గ్రామంలోని పలువురి వద్ద సుమారు రూ.8 లక్షలు అప్పు చేసినట్లు సమాచారం. అప్పు ఎలా తీర్చాలనే ఆందోళనతో ఆయన కొంతకాలంగా మానసికంగా కలత చెందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 15వ తేదీ తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లిన బిక్షపతి, గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్ద పురుగుమందు సేవించి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఉదయం కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతరం వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు రవుల రాజేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బిక్షపతి మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపినట్లు సమాచారం.

# వైసిపి ఓట్లను తొలగించే కుట్రలో చంద్రబాబు

**సర్ ప్రక్రియపై నాలుగు వారాలు అప్రమత్తంగా ఉండాలి**
**ఫిర్యాదులు వస్తే వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి**
**పార్టీ సీనియర్ నేతలు, ముఖ్య నాయకులతో సమీక్షలో జగన్**

**అమరావతి,జూన్16(జై భీమ్ న్యూస్):**

రాబోయే నాలుగు వారాలు అత్యంత కీలకమని పేర్కొంటూ సర్ ప్రక్రియ పట్ల పార్టీ శ్రేణులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచించారు. వైసీపీకి అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని జగన్ ఆరోపించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు, బూత్ స్థాయి నాయకులు నిర్లక్ష్యం చేయకుండా ప్రతిరోజూ పరిస్థితులను సమీక్షించాలని ఆదేశించారు. ఓట్ల తొలగింపుకు సంబంధించిన ఫిర్యాదులు వస్తే వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, సమస్య పరిష్కారం కాకపోతే పార్టీ కేంద్ర కార్యాలయానికి సమాచారం అందించాలని సూచించారు. తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ సీనియర్ నేతలు, ముఖ్య నాయకులతో కీలక సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) పక్రియపై ప్రత్యేకంగా చర్చించిన జగన్, ఒక్కసారి ఓటు తొలగించబడితే తిరిగి జాబితాలో చేర్పించడం కష్టమవుతుందని పేర్కొన్న జగన్, ప్రతి ఓటును కాపాడుకోవడం పార్టీ శ్రేణుల బాధ్యత అని అన్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి అలసత్వానికి తావివ్వకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. అధికార దుర్వినియోగంతో ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రతి బూత్‌లో కనీసం 50 ఓట్లు తొలగించడమే కూటమి లక్ష్యంగా పనిచేస్తోందని ఆరోపించిన జగన్, వివిధ గిమ్మిక్కుల ద్వారా ఓట్ల తొలగింపునకు చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బూత్ లెవల్ ఏజెంట్లు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని, ఎస్ఐఆర్ పక్రియపై రోజువారీ పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. రాబోయే రోజుల్లో ఓటర్ల జాబితా సవరణ పక్రియలో ప్రతి ఓటును రక్షించేందుకు పార్టీ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్..

## జూలై 19నుంచి ఉజ్జయినీ మహంకాళి బోనాలు

హైదరాబాద్,జూన్16(జై భీమ్ న్యూస్):తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవస్థానం ఆషాఢ బోనాల జాతర మహోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ ఏడాది నిర్వహించబోయే వార్షిక బోనాల జాతర కార్యక్రమాల అధికారిక షెడ్యూల్ వివరాలను ఆలయ చైర్మన్, అర్చక బృందం కలిసి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి అందజేశారు. జాతరను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు వీలుగా ముందస్తు ఏర్పాట్లపై చర్చించేందుకు ఈ వివరాలను మంత్రికి సమర్పించారు. ఆలయ దేవస్థానం ప్రకటించిన అధికారిక షెడ్యూల్ ప్రకారం.. జూలై 19వ తేదీ ఆదివారం సాయంత్రం 4:00 గంటలకు అమ్మవారి ఘటోత్సవం కార్యక్రమంతో ఈ మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నాయి. అనంతరం, జాతరలో అత్యంత కీలకమైన ప్రధాన బోనాల ఉత్సవాన్ని ఆగస్టు 2వ తేదీ ఆదివారం తెల్లవారుజామున 4:00 గంటల నుంచే ప్రారంభించనున్నారు. ఆ రోజంతా లక్షలాది మంది మహిళలు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకోనున్నారు. జాతర మరుసటి రోజైన ఆగస్టు 3వ తేదీ సోమవారం ఉదయం 8:30 గంటలకు భవిష్యవాణిని వినిపించే ప్రసిద్ధ రంగం కార్యక్రమం జరగనుంది. ఆ తర్వాత ఉదయం 10:30 గంటల సమయంలో అత్యంత కోలాహలంగా అమ్మవారి గజవాహన ఊరేగింపు మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.

# హార్మూజ్ ఇక టోల్ ఫ్రీ ఏరియా

**నౌకలు స్వేచ్ఛగా వెళ్లేందుకు అనుమతి**
**శుక్రవారం నాటికి పూర్తిగా తెరుచుకుంటుంది**
**ఇరాన్‌పై కుదిరిన ఒప్పందాన్ని త్వరలో వెల్లడిస్తా**
**జి 7 సదస్సులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన**

**ప్యారిస్,జూన్16(జై భీమ్ న్యూస్) :**

ఫ్రాన్స్‌లో జీ 7 సదస్సు వేదికగా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. హార్మూజ్ శాశ్వతంగా టోల్ రహితంగా ఉంటుందని వెల్లడించారు. సమ్మిట్‌ను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగం చేశారు. ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి శుక్రవారం నాటికి పూర్తిగా తెరుచుకుంటుందని.. ఇకపై అది శాశ్వతంగా టోల్ ఫ్రీగా అందుబాటులో ఉంటుందని ప్రకటించారు. అలాగే ఇరాన్‌తో కుదిరిన అవగాహన ఒప్పందం పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తానని.. దీనిపై ప్రత్యేకంగా మీడియా సమావేశం కూడా నిర్వహిస్తానని తెలిపారు. ఇరాన్‌తో కుదిరిన ఈ ఒప్పందాన్ని అమెరికా కాంగ్రెస్ పరిశీలనకు పంపనున్నట్లు ట్రంప్ చెప్పారు. ఈ ఒప్పందంలో ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయబోదని స్పష్టంగా పేర్కొన్నామని వెల్లడించారు. ఇరాన్‌తో చర్చల తొలి దశ విజయవంతంగా పూర్తైందని.. రెండో దశ చర్చలు మరింత వేగంగా పూర్తవు తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్ ఒప్పందానికి సంబంధించిన పూర్తి పాఠ్యాన్ని అధికారిక కార్యక్రమంలో విడుదల చేస్తానని వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య ఇటీవల కుదిరిన శాంతి ఒప్పందం ప్రపంచ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. ముఖ్యంగా హార్మూజ్ జలసంధి పునఃప్రారంభం ప్రపంచ ఇంధన మార్కెట్లకు ఊరటనివ్వనుంది. ఇదిలా ఉండగా.. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ కీలక ప్రకటన చేసింది. అమెరికాతో ఒప్పందం అనంతరం ఇరాన్‌కు చెందిన చమురు ట్యాంకర్లు, ఇతర వాణిజ్య నౌకలు మళ్లీ సముద్ర మార్గంలో ప్రయాణాలు ప్రారంభించాయని వెల్లడించింది. అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధనం సడలింపుకు ఇది సంకేతమని పేర్కొంది. ప్రస్తుతం మూడు ఇరానియన్ చమురు ట్యాంకర్లు ఉత్తర హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తుండగా.. మరో రెండు నౌకలు అవసరమైన సరుకులు, పశువుల మేతతో దక్షిణ ఇరాన్ నౌకాశ్రయాల వైపు వెళ్తున్నాయని ఇరాన్ మీడియా తెలిపింది. ఏప్రిల్ 13 నుంచి అమల్లో ఉన్న అమెరికా నౌకాదళ ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ నౌకల రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. అయితే తాజా ఒప్పందంతో ఆ దిగ్బంధనాన్ని ఎత్తివేసే పక్రియ అమలులోకి వచ్చిందని ఇరాన్ వర్గాలు చెబుతున్నాయి. ఈ పరిణామం ప్రపంచ చమురు సరఫరా వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# బీసీలపై కక్షపూరిత చర్యలకు పాల్పడ్డ జగన్

**అమర్‌నాథ్ గౌడ్ హత్యే ఇందుకు నిదర్శనం**
**మంత్రి లోకేశ్ ఘాటు విమర్శలు**

**అమరావతి,జూన్16(జై భీమ్ న్యూస్) :**

జగన్ హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఫైర్ అయ్యారు. వైసీపీ హయాంలో బీసీలపై కక్షపూరిత చర్యలకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. బీసీలు అంటే జగన్‌కు ఎంత కక్షో అమర్నాథ్ గౌడ్ సజీవదహనం నిరూపించిందని పేర్కొన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలపై గొడ్డలి పార్టీ కక్షగట్టిందని ధ్వజమెత్తారు. మంగళవారం అమరావతి వేదికగా మీడియాతో మంత్రి లోకేశ్ మాట్లాడారు. తన అక్కను గొడ్డలి పార్టీ నేతలు వేధిస్తుంటే ప్రశ్నించినందుకు జూన్ 15, 2023న బడికి వెళ్తున్న 15ఏళ్ల బీసీ బాలుడు అమర్నాథ్ గౌడ్‌ను దారుణంగా కొట్టి, కట్టేసి సజీవ దహనం చేశారని మండిపడ్డారు.నాడు గొడ్డలి పార్టీ నిందితులను రక్షించేందుకు ప్రయత్నించిందని మంత్రి లోకేశ్ ఆగ్రహించారు. అన్యాయంగా అమర్‌నాథ్ గౌడ్‌ని చంపేశారని.. ఆయన మృతిచెంది మూడేళ్లు అవుతోందని తెలిపారు. గొడ్డలి పార్టీ వల్ల అన్నివిధాలా నష్టపోయిన అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి నారా లోకేశ్ భరోసా కల్పించారు. వైసీపీ పైశాచికత్వానికి పరాకాష్ట అమర్నాథ్ గౌడ్ హత్య అని మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. ఐదేళ్ల పాలనంతా బడుగు బలహీన వర్గాలను వేధించడమేనని ఆగ్రహించారు. చేయాల్సిన అరాచకాలన్నీ చేసి ఇప్పుడు వైసీపీ నేతలు నీతులు చెబుతున్నారని విమర్శించారు. కుట్రలతో రాష్ట్రంలో అలజడులే అజెండాగా జగన్ రెడ్డి అడుగులేస్తున్నారని దుయ్యబట్టారు. అమర్నాథ్ గౌడ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు మంత్రి కొల్లు రవీంద్ర.

# పారదర్శకంగా యూరియా పంపిణీ

**ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇంటినుంచే బుకింగ్**
**ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులకు లబ్ది**
**క్యూ లైన్లు కట్టాల్సిన దుస్థితి రాకుండా నిర్ణయం**
**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**కామారెడ్డి,జూన్16(జై భీమ్ న్యూస్) :**

రైతులకు పారదర్శకంగా యూరియా పంపిణీ చేస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో మంత్రి మాట్లాడుతూ.. క్యూ లైన్లు అవసరం లేకుండా ఇంటి నుంచే యూరియా బుకింగ్ చేసుకునే సౌకర్యాన్ని రైతులకు కల్పిస్తామన్నారు. ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులు బుకింగ్ చేసుకున్నారని వివరించారు. మొత్తం13.22 లక్షల యూరియా బస్తాల బుకింగ్ చేసుకుంటే.. 84.6 శాతం పంపిణీ పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రంలో 90.22 లక్షల యూరియా బస్తాల భారీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతుల సూచనలతో ఫర్టిలైజర్ యాప్‌లో నిరంతర మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. స్మార్ట్ ఫోన్ లేని రైతులకు టోల్ ఫ్రీ ద్వారా యూరియా బుకింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ టోల్ ఫ్రీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ యాప్ వినియోగంలో నిజామాబాద్ జిల్లా రైతులు రాష్ట్రంలో ముందంజలో ఉన్నారని ప్రశంసించారు. యూరియా బ్లాక్ మార్కెటింగ్, అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకే ఈ డిజిటల్ విధానం అమల్లోకి తీసుకొచ్చినట్లు వివరించారు. నిజమైన రైతులకు మాత్రమే ఎరువులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు.అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం ఉన్నా యూరియా కొరత రానివ్వమని రైతులకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల భరోసా కల్పించారు. పెద్ద రైతులు ఆందోళన చెంద వద్దని.. అందరికీ సమానంగా ఎరువుల పంపిణీ చేస్తామన్నారు. అధిక యూరియా వినియోగం భూసారానికి హానికరం అని రైతులను ఆయన హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తక్కువ వర్షాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రైతులకు స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలంటూ రైతులకు మంత్రి తుమ్మల సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరికి బదులు ఆయిల్ పామ్ వంటి లాభసాటి పంటల వైపు వెళ్లాలని రైతులకు స్పష్టం చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతాంగానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా కల్పించారు.

# ముస్సోరిలో విశాఖకు చెందిన టెక్కీ మృతి

**భర్తతో కలసి విహార యాత్రకు వెళ్లిన రాధాగాయత్రి**
**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**న్యూఢిల్లీ,జూన్16(జై భీమ్ న్యూస్) :**

ఢిల్లీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న 27 ఏళ్ల రాధా గాయత్రి ముస్సోరీలో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెందిన ఘటన కలకలం రేపుతోంది. భర్తతో కలిసి విహారయాత్రకు వెళ్లిన ఆమె ముస్సోరీలోని హోమ్‌స్టే గదిలో విగతజీవిగా మారారు. మృతురాలిని పి. రాధా గాయత్రిగా గుర్తించారు. ఆమె భర్త సౌమ్య శ్రీచరణ్‌తో కలిసి సెలవులు గడిపేందుకు ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీకి వెళ్లారు. రాధా గాయత్రి, శ్రీ చరణ్ ఇద్దరూ ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి చెందిన వారు. వీరికి 2025 నవంబర్ 8న వివాహం జరిగింది. గాయత్రి ఢిల్లీలో నివసిస్తూ గురుగ్రామ్‌లోని ఒక ఐటీ సంస్థలో పనిచేస్తున్నారు. ఆమె భర్త శ్రీచరణ్ పుణెలో ఐటీ సంస్థలో పని చేస్తున్నారు. వీరిద్దరూ జూన్ 14 రాత్రి ముస్సోరీలోని కియానా హోమ్‌స్టేకు చేరుకున్నారు. భర్త చెప్పిన వివరాల ప్రకారం.. వారిద్దరూ ఆ రాత్రి మద్యం సేవించి, తెల్లవారుజామున 3:30 గంటలకు నిద్రపోయారు. శ్రీచరణ్ ఉదయం నిద్రలేచి చూసేసరికి.. గాయత్రి నగ్నంగా, స్పృహ లేకుండా, నేలపై పడి ఉంది. ఆమె ముక్కు నుంచి రక్తం కారుతోంది. హోమ్‌స్టే సిబ్బంది ముస్సోరీ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు 108 అంబులెన్స్‌తో కలిసి ఆ ప్రదేశానికి చేరుకున్నారు. అంబులెన్స్ సిబ్బంది ఆమెను పరీక్షించి, మరణించినట్లు ధ్రువీకరించారు. గాయత్రి మృతదేహం నేలపై బట్టలు లేకుండా పడి ఉందని, పరుపుపై రక్తపు మరకలు కనిపించాయని, గదిలో రెండు ఖాళీ మద్యం సీసాలు, ఆహార పదార్థాలు లభ్యమయ్యాయని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం డెహ్రాడూన్‌లోని కరోనేషన్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# బిజెపికి లబ్ది చేకూర్చేలా సర్ ప్రక్రియ






**కేంద్రానికి తొత్తుగా మారిన ఎన్నికల సంఘం**
**బెంగాల్లో 92 లక్షల ఓట్ల తొలగింపే నిదర్శనం**
**బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో పిసిసి చీఫ్ విమర్శలు**

**సంగారెడ్డి,జూన్16(జై భీమ్ న్యూస్):**

కేవలం బిజెపికి లాభం చేకూర్చేలా సర్ ప్రక్రియ సాగుతోందని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మతతత్వ పార్టీలకు ప్రయోజనం చేకూరేలా ఎస్ఐఆర్ పక్రియ నిర్వహించే కుట్ర జరుగుతుందని విమర్శించారు. మంగళవారం సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్‌పై బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ పేరుతో 92 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని వివరించారు. ఈ పక్రియలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డితోపాటు తన ఓటు గల్లంతు అయినా ఆశ్చర్య పోనక్కర్లేదని వ్యంగ్యంగా అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అని ,అలాంటి దేశంలో కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీకి తొత్తుగా మారిందని ఆరోపించారు. 2002లో ఎస్ఐఆర్ పక్రియ పారదర్శకంగా జరిగిందని.. కానీ ప్రస్తుతం వారికి ఓట్లు పడవనుకుంటే వాటిని తొలగిస్తుందన్నారు. తమ ఓట్లు క్షేమంగా ఉండాలంటే బీఎల్ఏ కీలకంగా పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. రాజకీయాల్లో తనకు దామోదర రాజనర్సింహ ఓనమాలు నేర్పించారని గుర్తు చేసుకున్నారు. ఈ దేశంలో అతికొద్దిమంది నిజాయితీ పరుల్లో మీనాక్షి నటరాజన్ ఒకరని పేర్కొన్నారు. అకారణంతోనే ఆమె రాజ్యసభ నామినేషన్ పత్రాన్ని తిరస్కరించారని తెలిపారు. బీజేపీ వాళ్లకి కనికరం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంతరం అధికారంలో ఉండి చక్రవర్తుల్లా ఉండాలని బీజేపీ నేతలు అనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. మీ కంటే పెద్ద చక్రవర్తులే నేలమట్టం అయ్యారు.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలు ఎంత..? అని ప్రశ్నించారు. అధికారం శాశ్వతం అనుకుంటే.. వారు మూర్ఖులే అవుతారన్నారు. దేవుళ్లకు ఎవరు వ్యతిరేకం కాదు.. కానీ దేవుడి పేరు చెప్పనిదే బీజేపీ వాళ్లకు ఓట్లు పడవన్నారు. ఏడాదిలో చాలాసార్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పూజలు నిర్వహిస్తారని.. కానీ దేవుళ్ల పేరుతో తాము ఓట్లు అడిగమన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని.. ఉన్న ఉద్యోగాలను తీసేస్తున్నారంటూ కేంద్రంపై టీపీసీసీ చీఫ్ నిప్పులు చెరిగారు. ఇకపోతే జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెనుక బీజేపీ ఉందని టీపీసీసీ చీఫ్ విమర్శించారు. కమలం పార్టీ ఆడించినట్టే.. ఆయన ఆడుతున్నారని ఆరోపించారు. మీ సానుభూతి తమకేం అవసరం లేదని పవన్‌కు స్పష్టం చేశారు. మీ కుట్రలు ప్రజలు గమనిస్తున్నారని పవన్‌కు సూచించారు. తెలంగాణ వచ్చినప్పుడు 10 రోజులు అన్నం తినలేదని పవన్ వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ 12 ఏళ్లలో తెలంగాణకు ఏం చేశారో చిట్టా ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. కేంద్రం నుంచి రాష్టానికి ఇంకా నిధులు రావాల్సి ఉందన్నారు. విభజన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదంటూ కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు మీరు సబర్మతి కట్టుకో వచ్చు.. తాము మూసి ప్రక్షాళన చేస్తామంటే నిధులు ఇవ్వరని అసహనం వ్యక్తం చేశారు. వీటికి సమాధానం చెప్పాలంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి స్పష్టం చేశారు. ఓ వైపు బీజేపీ, మరో వైపు బీఆర్ఎస్ పార్టీలు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ, టీజీఐఐసీ చీఫ్ నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఈగిల్ ఫోర్స్ దాడులు

**గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా**
**19మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**
**14మందికి గంజాయి పాజిటివ్‌గా గుర్తింపు**

హైదరాబాద్,జూన్16(జై భీమ్ న్యూస్): తెలంగాణలోని వివిధ కమిషనరేట్ల పరిధిలో గంజాయి, డ్రగ్స్ వినియోగంపై భారీగా ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో మంగళవారం ఈగల్ ఫోర్స్ పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా 19 మందిని ఈగల్ ఫోర్స్ అదుపులోకి తీసుకుంది. వారికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. 14 మందికి గంజాయి పాజిటివ్, మరో వ్యక్తికి గంజాయితోపాటు డ్రగ్స్ పాజిటివ్ వచ్చింది. పట్టుబడిన వారందరూ డ్రగ్స్ వినియోగించినట్లు విచారణలో అంగీకరించారని ఈగల్ ఫోర్స్ వెల్లడించింది. వీరందరిని డీ అడిక్షన్ సెంటర్లకు తరలించామని పేర్కొంది. వీరి తల్లిదండ్రులకు సమాచారం అందించామని తెలిపింది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లతో పాటు మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఈగల్ ఫోర్స్ ఈ దాడులు చేసింది. ఈగల్ ఫోర్స్15 బృందాలను ఏర్పాటు చేసి వారి సమన్వయంతో ఈ ఆపరేషన్ నిర్వహించారు. విచారణలో గంజాయి, డ్రగ్స్ తీసుకున్న వారి నుంచి ఈగల్ ఫోర్స్ పలు కీలక విషయాలు రాబట్టింది. గోవాలోని వగటోర్ బీచ్ ప్రాంతాన్ని ఒక ముఠా కేంద్రంగా తీసుకుని కొకైన్, ఎండీఎంఏ, ఎల్ఎస్డీ, హ్యాష్ ఆయిల్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించింది. వాటిని బెంగళూరు, గోవా నుంచి హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నట్లు కనుక్కొంది. సినీ పరిశ్రమలోని పలువురికి వీటిని విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. సాంకేతిక విశ్లేషణ ద్వారా మొత్తం 44 మంది వినియోగదారులను ఈగల్ ఫోర్స్ గుర్తించింది. డ్రగ్స్ వినియోగదారులు హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకతోపాటు గోవాలో ఉన్నట్లు విచారణలో బహిర్గతమైందని ఈగల్ టీం తెలిపింది. డ్రగ్స్ కొనుగోలు కోసం వినియోగదారులు చక్రపాణి, హర్షిత్ రెడ్డిల ఖాతాలకు రూ.3.13 లక్షలకుపైగా నగదు బదిలీ అయినట్లు గుర్తించింది. 2019లో వీరిద్దరు ఎన్‌డీపీఎస్ కేసులో అరెస్టయినట్లు ఈగల్ టీం వెల్లడించింది.

# రొయ్యల ఫీడ్ ధరలు పెంచేది లేదు

**అనుమతి లేకుండా పెంచితే కఠిన చర్యలు**
**గొడ్డలిపార్టీ ప్రతిదీ రాజకీయం చేస్తోందని ఆగ్రహం**
**ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు**

**పార్వతీపురం,జూన్16(జై భీమ్ న్యూస్):**

అనుమతి లేకుండా ఫీడ్ ధరలు పెంచితే ఊరుకునేది లేదని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు. అనుమతి లేకుండా ఫీడ్ ధరలు పెంచడాన్ని నిలిపివేశామని స్పష్టం చేశారు. మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు. ప్రతి చిన్న అంశాన్ని రాజకీయం చేయడం గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డి నైజమని మంత్రి అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో విద్యుత్ సబ్సిడీ కేవలం రూ.750 కోట్లు ఇచ్చారని అన్నారు. కూటమి ప్రభుత్వం రొయ్యల రైతులకు ఏడాదికి రూ.1,170 కోట్ల విద్యుత్ సబ్సిడీ ఇస్తుందని స్పష్టం చేశారు. సోయాబీన్, ఫిష్ ఆయిల్ ధరలు పెరిగిన మాట వాస్తవమేనని చెప్పుకొచ్చారు. ముడి పదార్థాల ధరల భారం రైతులపై ఒక్కసారిగా మోపడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం, అధికారులు, రైతులు, తయారీదారులతో కూడిన కమిటీ ద్వారానే ఇకపై ధరల నిర్ణయం ఉంటుందని పేర్కొన్నారు. రొయ్యల రైతుల ప్రయోజనాల పరిరక్షణెళి తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. జోన్, నాన్-జోన్, 10 ఎకరాల పరిమితి నిబంధనలని తొలగించామని తెలిపారు. ప్రతి ఆక్వా రైతుకూ యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. గతంలో ల్యాబ్‌ల పేరుతో ప్రచారం తప్ప క్షేత్రస్థాయిలో సౌకర్యాలు లేవని ప్రస్తావించారు. రాష్ట్రంలోని ఏ గ్రామానికైనా వచ్చి వాస్తవాలు పరిశీలించాలని గొడ్డలి పార్టీ అధ్యక్షుడుకి సవాల్ విసిరారు. ఫీడ్ ధరల నియంత్రణకు దేశంలోనే తొలిసారిగా ప్రత్యేక రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేశామని మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు.

# సిఎం రేవంత్ వ్యాఖ్యలపై బండి ఆగ్రహం

## మెట్రోను అడ్డుకునే ఖర్మ కిషన్‌రెడ్డికి లేదని వెల్లడి

**కరీంనగర్,జూన్16(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. మెట్రో విస్తరణను అడ్డుకోవాల్సిన ఖర్మ పట్టలేదన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మెట్రో ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన అవసరం కిషన్ రెడ్డికి లేదన్నారు. అర్థంలేని ఆరోపణలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ సర్టిఫికెట్ తమకు అవసరం లేదని వ్యాఖ్యానించారు. కావాలనే ప్రాజెక్ట్‌పై సిఎం రేవంత్ రెడ్డి పదేపదే అనవసర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. 'సర్' విషయంలో కాంగ్రెస్ గందరగోళం చేస్తోందని మండిపడ్డారు. బంగ్లాదేశ్ వాళ్లకు ఓటు ఇవ్వాలా అని ప్రశ్నించారు. ఇతర దేశాల వారి ఓట్లను తొలగించాలని కాంగ్రెస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని కేంద్ర మంత్రి నిలదీశారు. మావోయిస్టులు చివరికి సాధించింది ఏంటని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. తుపాకీ గొట్టంతో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని.. అభం శుభం తెలియని మైనర్లు ప్రాణాలు కోల్పోయారన్నారు. చివరికి మావోయిస్టు సంస్థని నిషేధానికి గురయ్యేలా చేశారని వ్యాఖ్యానించారు. తుపాకీ గొట్టం ద్వారా ఏమీ సాధించలేమని మావోయిస్టు అగ్ర నేతలు కూడా గుర్తించారని.. కేంద్రానికి సహకరించి చాలామంది లొంగిపోయారన్నారు. మావోయిస్టులు ఇక లేరని అన్నారు. మావోయిస్టు భావజాలంతో ఏదైనా సాధిద్దాం అనే ఆలోచన ఉన్న వ్యక్తులు ఆ ఆలోచనలను విరమించుకోవాలని సూచించారు. తుపాకీ గొట్టం ద్వారా ఏమీ సాధించలేమని రుజువయ్యిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ఇదిలఅఆవుంటే తెలంగాణలోని అధికార పార్టీ కాంగ్రెస్, ప్రత్యేకించి సీఎం రేవంత్‌రెడ్డి కొంత కాలంగా బీజేపీని లక్ష్యంగా చేసుకుని విమర్శిస్తున్నారు. ప్రత్యేకంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మీద విరుచుకు పడుతున్నారు. ఈ క్రమంలో తమ మీద వస్తున్న విమర్శలకు వివరణలు ఇచ్చుకోవడంతోనే కాషాయ నేతలకు పుణ్యకాలం గడిచిపోతోంది. అందుకే ఇక ఎంత మాత్రం ఉపేక్షించకూడదన్న క్లారిటీకి వచ్చి రివర్స్ అటాక్ మొదలు పెట్టిందని సమాచారం. ఇందులో భాగంగానే బండి సంజయ్ ఎదురుదాడికి దిగినట్లు తెలుస్తోంది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతున్న తీరు చూస్తే కూడా రేవంత్‌ను ఎదిరిస్తోంది. తన సహజ శైలికి భిన్నంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ పెద్దల మీద హాటు ఘాటు విమర్శలు చేస్తున్నారంటే అది కచ్చితంగా మారిన పార్టీ వైఖరిలో భాగమేనని అంటున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో సీఎం రేవంత్ రెడ్డి మీద కౌంటర్ ఎటాక్ చేయకపోతే పార్టీ కేడర్‌లోకి కూడా తప్పుడు సంకేతాలు వెళతాయన్న అభిప్రాయం బీజేపీ నేతల్లో ఉంది. అందుకే ముఖ్యమంత్రి మీద డైరెక్ట్ అటాక్ స్టార్ట్ చేసినట్టు చెబుతున్నారు. ఆట నువ్వు మొదలు పెట్టావు 2028లో ఆ ఆటను మేము ముగిస్తాం. నన్ను తెలంగాణ నుంచి తరిమికొట్టే వాడు ఇంకా పుట్టలేదు? నేను చేతకాని రాహుల్ గాంధీ నాయకత్వం పని చేయడం లేదు. మా రాజీనామాలు సరే?. ఇచ్చిన గ్యారంటీలు అమలు చేయలేని మీ సంగతి ఏంటంటూ గతంలో ఎన్నడూ లేనతం ఘాటుగా రేవంత్ మీద మాటల దాడి చేశారు. తెలంగాణ ప్రాజెక్ట్‌లను కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారంటూ ఆరోపిస్తున్నారు సీఎం. కిషన్ రెడ్డి పై రేవంత్ వాడుతున్న భాష విషయంలో కూడా బీజేపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా బండి కూడా అటాక్ మొదలు పెట్టారు.

# ఎపి అభివృద్ధికి ఇతోధికంగా చేయూత

**వాజ్‌పేయ్ పార్కులో స్వచ్ఛభారత్‌లో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి**

**విజయవాడ,జూన్16(జై భీమ్ న్యూస్):**

కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడి ఉందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. ఒక రోజు పర్యటనలో భాగంగా విజయవాడ చేరుకున్న ఆయన.. నగరంలోని వాజ్‌పేయీ పార్కులో స్వచ్ఛభారత్‌లో భాగంగా చీపురు పట్టి చెత్త ఊడ్చారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే సుజనా చౌదరితో కలిసి పార్కులో మొక్కలు నాటారు. అనంతరం పార్క్‌కు వచ్చిన వాకర్స్‌తో ముచ్చటించారు. దేశంలో అత్యధిక కాలం సేవలందించిన ప్రధానిగా.. నరేంద్ర మోదీ చరిత్రలో నిలిచిపోయారన్నారు. 2014కు ముందు భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత క్షీణ దశలో ఉందని.. మోదీ ప్రధాని అయ్యాక అత్యంత వేగంగా అభివృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపాంతరం చెందిందని పేర్కొన్నారు. రైల్వే ఎలక్ట్రిఫికేషన్ జరిగిన రెండో దేశం భారత్ అని వివరించారు. ఎలక్ట్రానిక్



ఉత్పత్తులు 8 రెట్లు పెరిగాయి. అమరావతి కోసం హడ్కో నుంచీ రూ.11వేల కోట్లు ఇచ్చామన్న జోషి.. అమరావతి కనెక్ట్ చేస్తూ ప్రత్యేక రైల్వే లైన్ కోసం నిధులు సమకూర్చినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర అబివృద్ధి కోసం చంద్రబాబు, పవన్, మాధవ్ కలిసి బాగా పని చేస్తున్నారని ప్రహ్లాద్ జోషి కితాబిచ్చారు. రాజధాని అమరావతికి రోడ్, రైల్వే కనెక్టివిటీ పెంచుతున్నామని వెల్లడించారు. అమరావతి అభివృద్ధికి కేంద్రం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్టు చెప్పారు.

# దుర్గమ్మకు అగ్గిపెట్టెలో పట్టే చీర బహుకరణ

**ఇంద్రకీలాద్రిపై రూ.82 కోట్లతో విస్తరణ పనులు**

**విజయవాడ,జూన్16(జై భీమ్ న్యూస్):**

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు.. సిరిసిల్లకు చెందిన చేనేత కార్మికుడు నల్ల విజయ్‌కుమార్ అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీరను బహూకరించారు. ఆలయ ఈవో శీనానాయక్‌కు మంగళవారం ఉదయం పట్టుచీరను అందజేశారు. ఇక్కత్ డిజైన్‌తో మగ్గంపై నేసిన ఈ చీర దాదాపు ఐదున్నర మీటర్ల పొడవు, 48 అంగుళాల వెడల్పు ఉంటుందని విజయ్‌కుమార్ తెలిపారు. దీని తయారీకి వారం రోజులు పట్టిందని చెప్పారు. ఇదిలావుంటే విజయవాడ ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి.భక్తుల రద్దీ పెరగడంతో అందుకు అనుగుణంగా పనులు చేపట్టారు. దీంతో కనకదుర్గమ్మ ఆలయ స్వరూపం త్వరలోనే పూర్తిగా మారనుంది. రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా సుమారు రూ.82 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, ఆరు అంతస్తుల ప్రసాదం పోటు, నూతన అన్నప్రసాదం కాంప్లెక్స్ పనులు చాలా వరకు పూర్తయ్యాయి. జులై చివరి నాటికి ఈ సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# జనసేనలో జాయినింగ్స్ కమిటీ ఏర్పాటు

**పార్టీలో చేరేవారి కోసం 14మందితో కమిటీ**
**పార్టీ అధినేత పవన్ కల్యాణ్ వెల్లడి**

**అమరావతి,జూన్16(జై భీమ్ న్యూస్):**

జనసేన పార్టీలో చేరికల సమన్వయానికి జాయినింగ్స్ కమిటీని నియమించినట్లు పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. జనసేన పార్టీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్న ఇతర పార్టీల నేతలు, విద్యావంతులు, సామాజికవేత్తలు, తటస్థులను పార్టీలోకి ఆహ్వానించేందుకు ప్రత్యేకంగా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 14 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీ చేరికలను సమన్వయం చేస్తుందన్నారు. ఢిల్లీ పర్యటన అనంతరం ఈ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి పార్టీలో చేరికలపై దిశానిర్దేశర చేయనున్నట్లు పవన్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ తరహాలోనే తెలంగాణలోనూ జాయినింగ్స్ కమిటీ నియామకానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కమిటీలో ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్, పంతం నానాజీ, ఎంపీ లింగమనేని రమేశ్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, సామినేని ఉదయభాను, పార్టీ సీనియర్ నేతలు కొటికలపూడి చినబాబు, డా.హరిప్రసాద్, డా.పెదపూడి విజయ్ కుమార్, కొరికాన రవికుమార్, వంపూరు గంగులయ్య, టీసీ వరుణ్, ఆరణి మదన్ సభ్యులుగా ఉంటారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# నీట్ రీ ఎగ్జామ్‌తో అప్రమత్తం

**టెలిగ్రామ్ యాప్‌పై కేంద్రం ఆంక్షలు**

**న్యూఢిల్లీ,జూన్16(జై భీమ్ న్యూస్):**

నీట్ 2026 రీ-ఎగ్జామినేషన్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షను సురక్షితంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు టెలిగ్రామ్ యాప్ యాక్సెస్‌పై తాత్కాలిక ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది. ఐటీ చట్టం సెక్షన్ 69ం కింద ఈ చర్యలు తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. జూన్ 22 వరకు భారతదేశంలో టెలిగ్రామ్ యాప్ యాక్సెస్‌పై నియంత్రణ ఉండనుంది. ఈనెల 21న దేశవ్యాప్తంగా నీట్ 2026 రీ-ఎగ్జామ్ నిర్వహించనున్న నేపథ్యంలో, పరీక్ష భద్రతను దృష్టిలో ఉంచుకుని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సిఫార్సు మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.అలాగే, టెలిగ్రామ్‌లో ఈనెల 30 వరకు మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను పూర్తిగా నిలిపివేయాలని ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. పరీక్ష పూర్తయిన తర్వాత పాత టైమ్‌స్టాంప్‌లతో నకిలీ 'పేపర్ లీక్' ఆధారాలు సృష్టిస్తున్న ముఠాలను అడ్డుకోవడానికే మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌పై నిషేధం విధించినట్లు తెలుస్తోంది. పేపర్ లీక్ పేరుతో విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న నకిలీ టెలిగ్రామ్ ఛానళ్లపై ఇప్పటికే సైబర్ క్రైమ్ విభాగాలు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అహ్మదాబాద్‌లో 8 టెలిగ్రామ్ ఛానళ్లను నడుపుతూ రూ.1.5 కోట్ల మోసాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాను సైబర్ క్రైమ్ బ్రాంచ్ అరెస్ట్ చేసింది. జూన్ 21న జరగనున్న రీ-ఎగ్జామ్‌కు ముందు ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలపై ఎన్‌టిఎ స్పందించింది. అవన్నీ తప్పుడు ప్రచారాలేనని స్పష్టం చేస్తూ, విద్యార్థులు అధికారిక సమాచారం కోసం వెబ్‌సైట్ ను మాత్రమే అనుసరించాలని సూచించింది. ఎవరైనా మోసాలకు పాల్పడితే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కి ఫిర్యాదు చేయాలని కేంద్ర ప్రభుత్వం కోరింది.

# ఆర్ అండ్ బిలో కాంట్రాక్టర్లకు బకాయిలు

**యాదగిరిగుట్టకు సంబంధించి 350 కోట్లు పెండింగ్**
**కాంట్రాక్టర్లతో చర్చించిన మంత్రి కోమటిరెడ్డి**

**హైదరాబాద్,జూన్16(జై భీమ్ న్యూస్):**

గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లతో పనులు చేయించి బిల్లులు పెండింగ్‌లో పెట్టిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట నిర్మించామని గొప్పలు చెబుతున్నారని, గుట్ట బిల్లులు కూడా రూ.350 కోట్లు బకాయిలు పెట్టారన్నారు. మంగళవారం తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్‌తో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్‌ను చర్చలకు ఆహ్వానించామని.. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విరమించాలని కోరినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఆర్ అండ్ బీలో రూ.4వేల కోట్లు బకాయిలు పెట్టిందని.. కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని విమర్శించారు. బిల్లుల కోసం ఈనెల 18న చలో హైదరాబాద్ కు తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్ పిలుపునిచ్చిందని మంత్రి తెలిపారు. సీఎంతో మాట్లాడి బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చామన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విరమించాలని కోరగా.. ఈరోజు సాయంత్రం వరకు చర్చించుకుని నిర్ణయం చెబుతామని వారు చెప్పారన్నారు. పత్రికల్లో వార్తల కోసం మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు తమపై తప్పుడు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బట్టకాల్చి మీద వేస్తే కాలిపోతామని అనుకుంటున్నారని అన్నారు.

# ఆదాయానికి మించిన ఆస్తులు

**ల్యాండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరి ఇంట్లో ఎసిబి సోదాలు**
**భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తింపు**

**హైదరాబాద్,జూన్16(జై భీమ్ న్యూస్) :**

ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే పక్కా సమాచారంతో ల్యాండ్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరి ఇంట్లో ఎసిబి అధికారులు మంగళవారం ఉదయం నుంచి విస్తృత తనిఖీలు చేపట్టారు. నగరంలోని నరహరి నివాసంతో పాటు ఆయనకు సంబంధించిన ఆఫీసులు, బంధువులు, అత్యంత ఆప్తుల ఇళ్లలో ఎసిబి బృందాలు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లోని దాదాపు 10 విభిన్న ప్రాంతాలలో ఈ దాడులు కొనసాగుతున్నాయి. నరహరి తన అధికారిక ఆదాయానికి మించి భారీగా అక్రమ ఆస్తులను కూడబెట్టారనే ఆరోపణలపై ఎసిబి ఈ చర్యలు చేపట్టింది. ఈ తనిఖీల్లో కీలకమైన భూమి పత్రాలు, బ్యాంక్ ఖాతాల వివరాలు, నగదు, బంగారు ఆభరణాలకు సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ దాడులు ఇంకా కొనసాగుతున్నాయి. సోదాలు ముగిసిన తర్వాత పట్టుబడిన అక్రమ ఆస్తుల పూర్తి వివరాలను, వాటి మార్కెట్ విలువను ఏసీబీ అధికారులు అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది.ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో 13 చోట్ల సోదాలు జరుగుతున్నాయి. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. చార్మినార్‌తో సహా పలు ప్రాంతాల్లో తనిఖీలు జరుగుతున్నాయి. సోదాల్లో భాగంగా భారీగా అక్రమాస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు. ల్యాండ్ డాక్యుమెంట్‌లు, బంగారు ఆభరణాలతో పాటు రూ.1.10 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. నరహరితో పాటు ఆయన తమ్ముడి నివాసంలో సోదాలు కొనసాగుతున్నాయి. తమ్ముడి ఇంట్లోనూ భారీగా ఆస్తులను అధికారులు గుర్తించారు. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ఆస్తుల వివరాలపై అన్నదమ్ముల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ల్యాండ్ అండ్ సర్వే డిపార్ట్‌మెంట్‌లో మల్టీ జోన్ 2 డిప్యూటీ డైరెక్టర్‌గా నరహరి కీలక విధులు నిర్వహిస్తున్నారు. భూమి సర్వే, సరిహద్దు వివాదాల పరిష్కారం, భూమి స్వాధీనం వంటి కీలక ఉద్యోగ బాధ్యతలను ఆయన నిర్వర్తిస్తున్నారు. గతంలో రంగారెడ్డి జిల్లాకి ఏడీగా కొంకరి నరహరి పనిచేశారు. దీంతో ఆ సమయంలో కూడా భారీగా అక్రమాలకు పాల్పడినట్టు ఏసీబీ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# అన్నలు లేరని అలుసు తీసుకుంటే ఖబర్దార్

**ఇప్పుడు వారంతా మా పార్టీలోనే ఉన్నారు**
**సింగరేణిలో అక్రమాలను నిలదీస్తూనే ఉంటాం**
**బొగ్గుబాయి బాటలో కవిత వెల్లడి**

**మంచిర్యాల,జూన్16(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తలపెట్టిన భూగర్భగని వద్ద 'బొగ్గుబాయి' కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 గని ఆవరణలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన కవిత, టీఆర్ఎస్ శ్రేణులు, కార్మికసంఘం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. గేట్లను తోసుకొని కవిత, పార్టీ శ్రేణులు గని ఆవరణలోకి దూసుకెళ్లారు. 'బొగ్గు బాయి' కార్యక్రమంలో తమను అడుగడుగునా సింగరేణి యాజమాన్యం అడ్డుకుంటుందని, కార్మికులతో కలిసి గేట్ మీటింగ్ పెట్టుకునే హక్కు తమకు ఉందని ఈ సందర్భంగా కవిత అన్నారు. సింగరేణి యాజమాన్యం కార్మికులకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించకుండా మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని ఆరోపించారు. అడవిలో అన్నలు లేరని సింగరేణి యాజమాన్యం కార్మికులను వేధిస్తోందన్నారు. అన్నలు తమ పార్టీలో కూడా ఉన్నారన్నారు. కార్మికులకు ఇబ్బంది కలిగేలా వ్యవహరిస్తే.. ఊరుకునే ప్రసక్తే లేదని, అవసరమైతే న్యాయపరంగా ముందుకెళ్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. కవిత మాట్లాడుతూ.. 'గతంలో రాహుల్, రేవంత్, భట్టి సింగరేణిలో పర్యటించలేదా? కార్మికుల సమస్యలు తెలుసుకుంటే తప్పేంటి?. పోలీసులను పెట్టుకుని ఎన్నిరోజులు అధికారంలో ఉంటారు?. కార్మికుల సమస్యలపై టీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుంది' అని అన్నారు. ఈ సందర్భంగా మావోయిస్టులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అడవిలో అన్నలు ఉంటే.. అప్పట్లో ఇక్కడ ధైర్యం ఉండేది. సింగరేణి అధికారులు పద్ధతిగా పనిచేసేవారు. అడవిలో అన్నలు లేరని, అడిగే దిక్కులేదని.. సింగరేణి యాజమాన్యం అనుకుంటోంది. కానీ, అడవిలో అన్నలందరూ ఇప్పుడు టీఆర్ఎస్‌లోనే ఉన్నారు. కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తే వెంటాడుతాం అని అన్నారు.

# హోంమంత్రి అనితపై గుడివాడ కామెంట్స్

**దిగజారిపోయి మహిళలపై విమర్శలు సరికాదు**
**ఇది యావత్తు మహిళా లోకానికే అవమానం**
**అమరన్‌నాథ్ వ్యాఖ్యలపై మండిపడ్డ డిప్యూటి సిఎం**



**అమరావతి,జూన్16(జై భీమ్ న్యూస్):**

రాజకీయాల్లో విమర్శలు విధానపరంగానే ఉండాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితపై ఓ మాజీ మంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళల కట్టూబొట్టుపై కామెంట్స్ చేసే స్థాయికి ఆ నాయకుడి పార్టీవారు దిగజారిపోయారంటూ వ్యాఖ్యానించారు. స్త్రీల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఆ వ్యాఖ్యలు కేవలం హోం మంత్రిని అన్నట్టే కాదని.. సగటు మహిళలందరినీ కించపరచినట్లే అని పవన్ అన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారి నోటి నుంచి వచ్చే ప్రతి మాటను పౌర సమాజం గమనిస్తోందనే విషయాన్ని మరచిపోవద్దని పవన్ అన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు ఉంటాయని... అవి విధానపరంగానే ఉండాలన్నారు. ఒక పాలసీ నచ్చకపోతే ఆ పాలసీ విషయంపైనే విమర్శించాలన్నారు. వాచలత్వంతో ఇళ్లలోని స్త్రీలను కూడా కించపరచే నైజం ఉన్న పార్టీ చేసే కామెంట్స్‌లను బలంగా తిప్పికొట్టేటప్పుడు వాళ్లు చేస్తున్న వ్యాఖ్యల్లో ఎంతటి అభ్యంతరకరమైన విషయం ఉందో ప్రజలకు తెలియజెప్పాలని కూటమి నేతలకు సూచించారు. కూటమి నేతలందరూ పౌర సమాజం హర్షించే భాషలో మాట్లాడి బలంగా బదులివ్వాలన్నారు. అవతలి పార్టీవాళ్ల మాదిరి దిగజారుడు భాష, అర్థరహిత వ్యాఖ్యలు కూటమి నేతలకు అవసరం లేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# గాయని శ్రీలలిత నివాసానికి ప్రహ్లాద్ జోషి


**12 సుపరిపాలన పుస్తకాన్ని అందించిన కేంద్రమంత్రి**
**ఇంద్రకీలాద్రిపై అమ్మవారికి ప్రత్యేక పూజలు**

**విజయవాడ,జూన్16(జై భీమ్ న్యూస్) :**

విజయవాడలో వివిధ కార్యక్రమాలలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ యువ గాయని శ్రీలలిత నివాసానికి కేంద్ర మంత్రి విచ్చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని 12 ఏళ్ల సుపరిపాలన, సాధించిన విజయాలపై రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని శ్రీలలితకు అందజేశారు. కర్ణాటక, హిందుస్తానీ సంగీత శైలులు రెండింటిలోనూ రాణిస్తున్న శ్రీలలితను ప్రహ్లాద్ జోషి అభినందించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. రెండు విభిన్న సంగీత పక్రియలను నేర్చుకోవడం ఎంతో కష్టతరమన్నారు. గతంలో ప్రధాని మోదీ స్వయంగా శ్రీలలిత ప్రతిభను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రశంసించారని తెలిపారు. కర్ణాటకలో ధార్వాడ్.. హిందుస్తానీ సంగీతానికి ఎందరో మహానుభావులను అందించిందన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ సాధించిన అద్భుత ప్రగతిని, ప్రపంచ సంక్షోభాల సమయంలోనూ దేశాన్ని సమర్థవంతంగా నడిపించిన తీరు గురించి అందరూ తెలుసుకోవాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ఇక్కడి రాజధానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఉదయం ఇంద్రకీలాద్రి చేరుకున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు ఆలయ మర్యాదలతో ఆలయ అర్చకులు, దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని, వేద పండితుల చేత వేద ఆశీర్వచనం పొందారు. అనంతరం కేంద్ర మంత్రికి అమ్మవారి లడ్డూ ప్రసాదాన్ని, చిత్రపటాన్ని ఆలయ అధికారులు అందజేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

## స్టార్‌డమ్‌తో నాలో అహంకారం పెరిగింది: సమంత



స్టార్‌డమ్‌ను చూసి ఆశ్చర్యపోయానన్న సమంత

వరుస హిట్లతో స్టార్‌డమ్‌కు బానిసయ్యానని వ్యాఖ్య

నటిగా అహంకారం పెరిగి తనకు ముగింపు లేదనుకున్నానని వెల్లడి

అనారోగ్యంతో తీసుకున్న విరామం ఆలోచనలను మార్చిందన్న హీరోయిన్

జూన్ 19న ప్రేక్షకుల ముందుకు 'మా ఇంటి బంగారం' సినిమా

స్టార్‌డమ్ మత్తులో తాను కూడా కొట్టుకుపోయానని, వరుస విజయాలు తనలో అహంకారాన్ని పెంచాయని ప్రముఖ నటి సమంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అనారోగ్య వల్ల ఇటీవల తీసుకున్న విరామం తన జీవితాన్ని, కెరీర్‌ను కొత్త కోణంలో చూసేలా చేసిందని వెల్లడించారు.'మా ఇంటి బంగారం' సినిమా విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సమంత తన సినీ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. "చిన్న పట్టణం నుంచి వచ్చిన ఓ అమ్మాయిగా స్టార్‌డమ్‌ను అనుభవించడం నాకు ఆశ్చర్యంగా అనిపించింది. ప్రేక్షకులు నా పేరును అరుస్తూ, నా సినిమాల కోసం ఎదురుచూడటం చూసి మరింత కష్టపడ్డాను. ఓ దశలో స్టార్‌డమ్ అనే ఆటకు బానిసయ్యాను. ఏడాదిలో ఐదు సినిమాలు చేశాను. అవన్నీ హిట్లు కావడంతో నాకో 'గోల్డెన్ లెగ్' ఉందని అందరూ అనేవారు. ఆ అంచనాలకు తగ్గట్టుగా ఉండాలనే ఒత్తిడిని నేనే నాపై పెట్టుకున్నా" అని చెప్పారు."అప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఇంకా ఎక్కువ సినిమాలు చేయాలనుకునేదాన్ని. నటిగా నాకు ముగింపు ఉండదనుకున్నాను. అదే ఒక రకమైన అహంకారం. కానీ ఆ విరామం తర్వాత నా కెరీర్‌కూ ఓ ముగింపు ఉంటుందనే విషయాన్ని అర్థం చేసుకున్నా. అది నా ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చింది. తిరిగి సినిమాల్లోకి వస్తే కొన్ని పాత అలవాట్లు మార్చుకోవాలని అప్పుడే నిర్ణయించుకున్నా" అని సమంత తెలిపారు. 2022లో తాను మయోసైటిస్ అనే ఆటో ఇమ్యూన్ వ్యాధితో బాధపడుతున్నట్లు సమంత వెల్లడించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం జూన్ 19న విడుదల కానుంది.

## పెళ్లి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన శ్రీముఖి

సరైన వ్యక్తి కోసం ఎదురుచూస్తున్నానన్న శ్రీముఖి

తాను కోరుకున్న వ్యక్తి దొరికిన వెంటనే పెళ్లి చేసుకుంటానని వెల్లడి

త్వరలోనే గుడ్ న్యూస్ చెప్పండి అంటూ నెటిజన్ల స్పందన

యాంకర్, నటి శ్రీముఖి తన పెళ్లి గురించి చేసిన సరదా వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. సమంత తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడుతూ... "ఈ సినిమా ప్రారంభమైనప్పుడు సమంత పెళ్లి జరిగింది. ఇప్పుడు సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ అయితే నా పెళ్లి కూడా జరగాలని కోరుకుంటున్నాను" అని నవ్వుతూ వ్యాఖ్యానించింది. సరైన పెళ్లి కొడుకు కోసం ఎదురుచూస్తున్నానని, దొరికిన వెంటనే పెళ్లి చేసుకుంటానని తెలిపింది.ఈ సందర్భంగా ప్రేక్షకులు, సినీ ప్రముఖులు చప్పట్లతో స్పందించగా, అభిమానులు సోషల్ మీడియాలో ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కొందరు "త్వరలో గుడ్ న్యూస్ చెప్పండి" అంటూ సరదా కామెంట్లు చేస్తున్నారు. కాగా, దర్శకురాలు నందినీ రెడ్డి తెరకెక్కించిన 'మా ఇంటి బంగారం' జూన్ 19న విడుదల కానుంది. ఈ చిత్రంలో శ్రీముఖ కీలక పాత్ర పోషించింది.






# ఆ పాటలో ఇంకాస్త బాగా చేసి ఉండాల్సింది: తమన్నా

'జైలర్' లో సూపర్ హిట్టయిన 'నువ్వు కావాలయ్యా' సాంగ్

ఆ సాంగ్‌లో తన పెర్ఫార్మెన్స్ పై అసంతృప్తిగా ఉన్నానన్న తమన్నా

ఇంకా బాగా చేసి ఉండాల్సింది అనిపించిందని వెల్లడి

ఫరా ఖాన్ యూట్యూబ్ వ్లాగ్‌లో ఆసక్తికర విషయాల వెల్లడి

ప్రస్తుతం సిద్ధార్థ్ మల్హోత్రాతో 'వ్వాన్', 'రాగిణి 3' చిత్రాల్లో నటిస్తున్న తమన్నా

రజినీకాంత్ నటించిన 'జైలర్' చిత్రంలోని 'నువ్వు కావాలయ్యా' పాట ఎంత పెద్ద హిట్టో అందరికీ తెలిసిందే. ఈ పాటలో తన డ్యాన్స్‌తో ప్రేక్షకులను ఉర్రూతలూగించిన నటి తమన్నా, ఆ పాటలో తన పెర్ఫార్మెన్స్ పట్ల తాను సంతృప్తిగా లేనని తాజాగా వెల్లడించారు. ఈ విషయం తెలిసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు.ప్రముఖ కొరియోగ్రాఫర్, దర్శకురాలు ఫరా ఖాన్ తన యూట్యూబ్ వ్లాగ్ కోసం ముంబైలోని తమన్నా ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా ఇద్దరూ తమన్నా కెరీర్‌లోని పలు పాటల గురించి మాట్లాడుకున్నారు. ఈ క్రమంలోనే 'కావాలయ్యా' పాట ప్రస్తావన వచ్చింది. అప్పుడు తమన్నా మాట్లాడుతూ, "ఆ పాట షూటింగ్ సమయంలో నా నటనపై నేను కొంచెం అసంతృప్తిగా ఉన్నాను. ఇంకా మెరుగ్గా చేసి ఉండాల్సింది అనిపించింది" అని తెలిపారు.దీనికి ఫరా ఖాన్ స్పందిస్తూ, "నువ్వు ఎప్పుడూ ఇంకా బాగా చేయొచ్చు అని భావించే రకం" అని అన్నారు. తాను శిక్షణ పొందిన డ్యాన్సర్‌ని కాదని, 'ఆజ్ కీ రాత్' అనే పాట కోసం 15 రోజులు రిహార్సల్స్ చేశానని, అలాంటి సమయం కేటాయించాలని కోరుకుంటానని తమన్నా వివరించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన 'కావాలయ్యా' పాటకు శ్రీసాయి కిరణ్ సాహిత్యం అందించారు. సింధుజా శ్రీనివాసన్, అనిరుధ్ రవిచందర్ ఆలపించారు. ఇక సినిమాల విషయానికొస్తే, తమన్నా ప్రస్తుతం పలు ఆసక్తికర ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి 'వ్వాన్ -- ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' అనే చిత్రంలో నటిస్తున్నారు. అలాగే, ఆమిర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ హీరోగా నటిస్తున్న 'రాగిణి 3' అనే హారర్ చిత్రంలోనూ ఆమె కీలక పాత్ర పోషిస్తున్నారు. ఏక్తా కపూర్ నిర్మిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM